JANA SAINYAM

# జనసైన్యం

ప్రజల పక్షం జనసైన్యం

తెలుగు దినపత్రిక



కరీంనగర్ జిల్లా. సంపుటి3. సంచిక 333 22 బుధవారం జూలై 2026 ఎడిటర్ గుంటపల్లిస్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5

# నరేందర్ రెడ్డి కప్పు విజేతలకు బహుమతి ప్రధానోత్సవం



14 పేజీలో

# నీట్ పేపర్ లీకేజీపై ప్రశ్నిస్తే విద్యార్థుల రక్తం కళ్ళ చూస్తారా?

జనసైన్యం సిటి

సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ..ఖనీట్ పేపర్ లీకేజీ వల్ల లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు బజారున పడ్డాయని, లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని,బాధ్యులైన కేంద్ర విద్యా శాఖ శాఖ రాజీనామా చేయాలని కాక్రోచ్ పార్టీ పిలుపుమేరకు దేశ రాజధాని ఢిల్లీ లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు,సీనియర్ సిటిజన్స్ వేలాదిగా తరలివచ్చి తమ అవేదన వ్యక్తం చేయడానికి ఆందోళన చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రధాని మోడీ వారిపై పాశవికంగా దాడులు చేయడం,లాఠీ ఛార్జీ చేసి,భాస్ప వాయువు ప్రయోగించి, విద్యార్థులను రక్తాలు కారే విధంగా కొట్టడం దుర్మార్గమని, ఉద్యమాలను అణచాలని చూస్తే మరింత పెరుగుతాయి తప్ప తగ్గవని, ప్రజలకు రక్షణగా ఉండాల్సిన మోడీ ప్రభుత్వం ప్రజలపై దాడులు చేయడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందని,కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నైతిక విలువల గురించి,రాముడు గురించి,రామరాజ్యం గురించి గొప్పలు గొప్పలు చెప్పే నరేంద్ర మోడీ వాటిని ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు.

తెలంగాణ అంటేనే దక్కన్ పీఠమని,ఎత్తుపై ఉందని,వంపులో గోదావరి ఉందని,కృష్ణా నది నీళ్ళకంటే గోదావరి నీళ్లే ఎక్కువగా ఉపయోగించుకోవాలని అన్నారు. మెట్ట ప్రాంతానికి సాగునీరు,త్రాగు నీరు కావాలని 1996 నుంచి సిపిఐ,రైతుసంఘం ఆధ్వర్యంలో ఆందోనలు చేసిందని,2000 సంవత్సరంలో రైతు సంఘం నేత అమరజీవి కొల్లి నాగేశ్వర్ రావు ఆమరణ నిరాహార దీక్ష కూడా చేశాడని,ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి జలాల వినియోగ అథారిటీ ఏర్పాటు చేశాడని కానీ దానివల్ల ఏం పని జరగలేదని,2004 లో వై ఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత జలయజ్ఞంలో భాగంగా గోదావరి జలాలను మెట్టప్రాంతలకు తరలించడానికి కొంత ప్రయత్నం చేశాడని,దాని మూలంగానే శ్రీరాం సాగర్ వరద కాలువ పనులు జరిగాయని, మిడ్ మానేర్, గౌరవెల్లి,గండిపల్లి ప్రాజెక్టుల పనులు జరిగాయంటె వైఎస్సార్ కారణమన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కరువు కోరల్లో నుండి కాపాడి వెంటనే ప్రజలకు త్రాగునీరు సాగు నీరు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేసారు. నీరు అనేది ప్రజల జీవితాలకి సంబందించిన విషయం కాబట్టి తక్షణమే రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని అన్నారు.

సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి.




కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఒకరి పై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నారని మండి పడ్డారు. తక్షణమే కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి వారి సహకారం తో మహారాష్ట్ర ముఖ్యమంత్రి తో మాట్లాడి తుమ్మిడి హాట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. కరీంనగర్ దిగువ మానేరు జలాషయం నీరు కనిష్ఠ స్థాయికి పడిపోయి దౌర్బాగ్యం స్థితిలో డ్యామ్ ఉందన్నారు. వెంటనే ఎల్లంపల్లి మిడ్ మానేరు నుండి నీరు ఎల్ ఎం డి కి వచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలని చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్,బోయిని అశోక్,గూడెం లక్ష్మీ, కసిరెడ్డి సురేందర్ రెడ్డి,న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు,బీర్ల పద్మ, కొట్టె అంజలి,నగర నాయకులు బాకం ఆంజనేయులు, కసిబోజుల సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.





విశ్విక కు జన్మదిన శుభాకాంక్షలు


అఖిల్‌కు జన్మదిన శుభాకాంక్షలు

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను భర్తరఫ్ చేయాలి




జనసైన్యం సిటి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఆర్ట్స్ కళాశాల నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత ఉద్యమిస్తున్నారని అన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులు, యువతపై పోలీసులు టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లు ప్రయోగించి, లాఠీచార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. దేశంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తన కేబినెట్‌లోని మంత్రిని కూడా రాజీనామా చేయించలేని పరిస్థితిలో ప్రధానమంత్రి ఉన్నారని విమర్శించారు. 21 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు కోల్పోయినా కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రతి అంశాన్ని "జిహాద్" పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ నాయకులు ఈ అంశంపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

రాష్ట్రాల హక్కులను హరిస్తూ విద్యారంగాన్ని కేంద్రీకరిస్తున్న చీూాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా పార్లమెంట్ వైపు వెళ్తున్న నిరసనకారులను బారికేడ్లతో అడ్డుకుని, పోలీసులు మరియు సివిల్ దుస్తుల్లో ఉన్న కొందరు వ్యక్తులు విచక్షణారహితంగా కొట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. అందువల్ల కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగ హక్కులను హరిస్తూ, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు ఈ అంశంపై స్పందించడం లేదని విమర్శించారు.

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ తెలంగాణలో అధికారంలోకి వస్తే ప్రతి విద్యార్థి బొట్టు పెట్టుకుని పాఠశాలకు రావాలని చెబుతున్నారని, కానీ దేశవ్యాప్తంగా విద్యార్థులను ప్రభావితం చేస్తున్న చీజుజు పరీక్షలో జరిగిన అవకతవకలపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులను, యువతను రెచ్చగొట్టడంలో చూపుతున్న శ్రద్ధ దేశ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో కనిపించడం లేదన్నారు. కాబట్టి తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు వెంటనే స్పందించి, చీజుజు పరీక్షలో నష్టపోయిన విద్యార్థులందరికీ న్యాయం చేయాలని, గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు వినయ్, ఇసాక్, సహాయ కార్యదర్శి గట్టు ఆకాశ్, గర్ల్స్ కన్వీనర్ మానస, జిల్లా కమిటీ సభ్యులు రోహిత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగిని వేధిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు

**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగర పాలక సంస్థలో మహిళా ఉద్యోగిపై అనేక విదగాలుగా లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారు ఇటీవల కాలంలో భర్త చనిపోయినప్పుడు దుఃఖంతో ఉన్న మహిళను భర్త ఉద్యోగం నగరపాలక సంస్థలు రావడంతో భర్త ఉద్యోగం చేస్తున్న మహిళను అదే కార్పొరేషన్ లో పనిచేస్తున్న తోటి ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు కొంతకాలంగా మహిళను ఎలాగైనా లొంగదీసుకోవాలని ఉద్దేశంతో ఒకరు కాదు ఇద్దరు ఉద్యోగులు ఏకంగా మహిళపై లైంగికంగా వేధింపులు మొదలుపెట్టారు ఏకంగా ఆఫీసులోనే ఆమెపై అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు బయటకు రావాలని ఫోన్ చేసి వేదింపులకు గురిచేస్తున్నారు ఆమె బయటికి రాకపోతే ఈ ఉద్యోగం పోతుందని బెదిరింపులకు గురి చేస్తున్నారు తోడు లేని మహిళకు ఊరు చివరి ప్రాంతంలో రావాలని తమతో గడపాలని లేనిచో ఉద్యోగం ఓడుతుందని అనేక రకాలుగా వేధింపులు గురి చేస్తున్నారు కార్పొరేషన్ పరిధిలో SIR విధులలో ఉన్న మహిళను కంప్యూటర్ విధులు చేస్తున్న ఇద్దరు వ్యక్తులు ఆమెకు ఫోన్ చేసి కలవకుంటే ఈ ఉద్యోగం ఊడుతుందని వేధింపులు గురి చేస్తున్నారు ఉద్యోగిని ఎలాగైనా రావాలని లైంగిక వాంఛను తీర్చాలని గురిచేస్తుంది దీంతో విసుగు చెందిన మహిళ తన వేధిస్తున్న ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్ల పై చర్యలు తీసుకోవాలని ఈనెల 13వ తేదీన బాధిత ఆపరేటర్ నగరపాల సంస్థ కమిషనర్ గారికి ఫిర్యాదు చేసింది కమిషనర్ విచారణకు ఆదేశించారు ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా మహిళలకు రక్షణ లేదని మరి దీనిపై పూర్తిస్థాయి సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపి దోషులను తేలినచో ఈ ఇద్దరిని జాబ్ నుండి సర్వీస్ రిమూవ్ చేయాలని మరి వీరి మీద కఠిన చర్య తీసుకోవాలని భవిష్యత్తులో ఎలా ఎవరు కూడా ఒక మహిళ మీద అఘాయితం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ మాజీ అధ్యక్షులు..


అబ్దుల్ రెహమాన్ పిలుపునిచ్చారు

# సిర్సపల్లి గ్రామంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



జనసైన్యం సిటి

గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో జయన్న ఫౌండేషన్ నిర్వాహకులు, సింగాపూర్ మాజీ ఎంపీటీసీ గుడిపాటి సరిత జయపాల్ రెడ్డి సుమారు రూ. 7 లక్షల సొంత ఖర్చులతో సిర్సపల్లి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. సోమవారం గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి గుడిపాటి సరిత జయపాల్ రెడ్డి వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సరిత జయపాల్ రెడ్డి మాట్లాడుతూ... కష్టపడి పైకొచ్చిన వారు సంపాదించిన దాంట్లో కొంత సమాజ శ్రేయస్సు కోసం ఖర్చు చేస్తే సార్థకత ఉంటుందని, సమాజానికి సేవ చేస్తే తమకు ఏదో ఒక రోజు, ఏదో ఒక రూపంలో తిరిగి వస్తుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. సమాజం బాగుంటనే మనం కూడా బాగుంటామని అన్నారు. సమాజ సేవ మనిషికి నిజమైన ఆనందాన్ని, ఇతరులకు సహాయం చేయడం ద్వారా మనసుకు శాంతి, ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు జయన్న ఫౌండేషన్ అండగా ఉంటుందని అన్నారు. పరీక్షల సమయాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకూడదని పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, వాటర్ బాటిళ్లు, టిఫిన్, రవాణా ఖర్చులు అందించినట్లు తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వందల మందికి కంటి ఆపరేషన్లు చేయించామని తెలిపారు. గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడానికి మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసిన గుడిపాటి సరిత జయపాల్రెడ్డి సేవలు నిజంగా అభినందనీయమని, కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులు తగ్గి, ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఇలాంటి మంచి పనులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని గ్రామసర్పంచ్ పోల్సాని రామారావు, పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు ఎడవెల్లి కొండాల్రెడ్డి, రాజపల్లి, చెల్పూర్ సర్పంచులు కట్కూరి మల్లారెడ్డి, వంతడుపుల కస్తూరి, కౌన్సిలర్ ఖాలిక్ హుస్సేన్, ఉప సర్పంచ్ జనగామ రాజేశ్వర్రావు, మాజీ సర్పంచ్ సువర్ణ విజయ్ కుమార్, గ్రామపంచాయితీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రాయిలర్ కోడి బాలలు



నేటి
శిశువు ఏసి రూంలో జన్మించి..
పుట్టుకతోనే 'ఐక్యూ'ను వెంటేసుకొని..
అమ్మానాన్నల అతి గారాల పట్టిగా..
ఇంటి నాలుగు గోడల జైల్లో..
సమాజానికి బహు దూరంగా..
స్మార్ట్ సో'సెల్' మాధ్యమాల్లో..
రేయింబవళ్లు మునిగి తేలుతూ..
అదే గదిలో తింటూ, అక్కడే..
మలమూత్ర విసర్జన చేస్తూ..
గొంతమ్మ కోర్కెలు తీర్చని వేళ..
ఇంటిని యుద్ధ క్షేత్రంగా మార్చుతూ..
పది మందిలో పిల్లిలా మారి..
ఇంట్లో యువరాజు/రాణిగా కాలరెగిరేసి..
చిట్టి వైఫల్యానికే తెగ బాధ పడుతూ..
ఒంటరితనాన్ని వెంటేసుకొని..
మానసిక రోగిగా మారి పోయి..
మైదాన ఆటలకు మంగళం పలికి..
వీడియో గేమ్స్‌లో కప్పులు గెలుస్తూ..
బంధుమిత్రులకు బహు దూరంగా..
తన చిట్టి గృహ సామ్రాజ్యంలో..
బ్రాయిలర్ కోడి వలె బతుకుతున్న..
నవ సమాజ మెరుగని నేటి పిల్లలు
జీవించే కళ తెలియని డిజిటల్ పిచ్చోళ్లు !

మధుపాళీ

## కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్స్‌కు సిజిహెచ్ఎస్ ఆరోగ్య కేంద్రం మంజూరు చేయాలి



**జనసైన్యం సిటి**
కరీంనగర్ లో కేంద్ర ఉద్యోగులు & పెన్షనర్స్ కు CGHS ఆరోగ్య కేంద్రం మంజూరు చేయాలి. ఉత్తర తెలంగాణకు తలమానిక కం ఉన్న కరీంనగర్ లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు & పెన్షనర్స్ ఆరోగ్య సేవలకు కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం CGHS వెల్నెస్ కేంద్రం ఏర్పాటు / మంజూరు చేయాలనీ ఉమ్మడి జిల్లా కేంద్ర ప్రభుత్వం నకు చెందిన పోస్టల్ మరియు RMS పెన్షనర్స్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వం ను కోరారు సోమవారం రాత్రి ఎఅతీ హెడ్ పోస్ట్ ఆఫీస్ లో వీ, లక్ష్మీపతి అధ్యక్ష తన జరిగిన సమావేశంలో గత 7 ఏళ్లుగా కేంద్ర హోం శాఖ మాత్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ ను అనేక మార్లు కలిసి విజ్ఞప్తి చేసిన ఇంతవరకు మంజూరు కాలేదు కరీంనగర్ సందర్శించి న ఇతర కేంద్ర మంత్రులు, కూడ మేమరాండం ఇచ్చిన ఫలితం లేదని చెప్పారు ప్రతి చిన్న ఆరోగ్య సమస్యలు లకు హైదరాబాద్ వెళ్లి రావాలి అంటే కష్టం మరియు వ్యయం గా ఉంది అలాగే కరోనా సమయంలో నిలిపి వేసిన 36 వాయిదాలు DA& DR లు ఇంతవరకు విడుదల చేయలేదు కేంద్ర ఉద్యోగులు లకు నియమించిన 8 వ పే కమిషన్ రిపోర్ట్ వచ్చేవరకు 50% ఇంటిరిమ్ రిలీఫ్ మంజూరు చేయాలి ఈ సమావేశం లో లక్ష్మీపతి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఉప్పల రామేశం, కోశాధికారి చంద్రమౌళి నాయకులు వొద్నాల రాజాప్రభాకర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా నూతన ము గా ఇటీవల కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ గా పదవి చేపట్టిన ఖ సైది రెడ్డి గారిని సత్కరించారు పోస్ట్ మాస్టర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

## టిజిసి జిటిఏ యూనిట్ కార్యవర్గ సభ్యుల ఏకగ్రీవ ఎన్నిక.




**జనసైన్యం సిటి**
శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కరీంనగర్ యూనిట్ బాడీ ఎన్నికలు ఈరోజు నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికలలో అధ్యక్షులుగా డాక్టర్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కట్టా వేణు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఆర్ రామకృష్ణ, కోశాధికారి ఽ మహిళా కార్యవర్గ సభ్యురాలిగా డాక్టర్ కే. కిరణ్మయి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా డాక్టర్ పడాల తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పి రాజేష్ గారు ప్రకటించారు. ఏకగ్రీవ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు కళాశాల ఉన్నత విద్యాశాఖ తెలంగాణ రాష్ట్ర ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షులు డాక్టర్ కదారు సురేందర్ రెడ్డి అభినందనలు తెలిపారు టి జి సి జి టి ఏ ఎస్ ఆర్ ఆర్ కాలేజ్ యూనిట్ బాడీ సభ్యులంతా హాజరై ఎన్నికైన కొత్త కార్యవర్గాన్ని అభినందించారు.

# పండ్లలో రారాజు, భారత జాతీయ ఫలం మామిడి పండు

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

### (22 జూలై "జాతీయ మామిడి దినోత్సవం" సందర్భంగా)



వేసవి కాలం రాగానే మార్కెట్లన్నీ మామిడి పండ్ల రాసులతో కళకళలాడుతాయి. మామిడి కేవలం పండు మాత్రమే కాదని, మన సంస్కృతి, చరిత్రలో ఒక అంతర్భాగంగా భావిస్తున్నాం. భారతదేశంలో 5,000 ఏండ్ల క్రితమే మామిడిని సాగు చేయడం ప్రారంభమైంది. హిందూ పురాణాల్లో మామిడి పండ్లు దేవతలతో ముడిపడి ఉన్నాయి. మామిడి ఆకును శుభంగా భావించిన శుభకార్యాల్లో తోరణాలుగా కూడా కట్టడం ఓ పవిత్రత సంప్రదాయంగా కొనసాగుతోంది. నోరూరించే రుచి, అమోఘమైన వాసన, ఆకర్షణీయమైన రంగు, ఆకట్టుకునే రూపం, దృష్టిని దోచుకునేరిమాణం, అద్భుత పోషక విలువలు, అత్యంత ప్రజాదరణ, వేల ఏండ్ల సాంస్కృతిక గుర్తింపు కలిగిన పండ్లు అనేకం ఉన్నప్పటికీ పండ్లన్నింటిలో మామిడి పండ్లకు ప్రత్యేకమైన స్థానం ఇవ్వబడింది.

**జాతీయ ఫలం – కింగ్ ఆఫ్ ఫ్రూట్ :**

ప్రపంచవ్యాప్తంగా మామిడి పండును "కింగ్ ఆఫ్ ఫ్రూట్" లేదా "పండ్లలో రారాజు" అని పిలవడం జరుగుతున్నది. భారత్‌లో "జాతీయ ఫలం" లేదా "నేషనల్ ఫ్రూట్"గా పిలువబడుతోంది. రుచి, సువాసనల ఆధారంగా భారత్‌లో ప్రధానంగా అల్ఫోన్సా, తోతాపురి, బంగినపల్లి, మల్గోవా, దసేరీ లాంటి మామిడి పండ్ల రకాలు ఎంతో ప్రసిద్ధి పొందాయి. ఆసియా దేశాల్లో అధికంగా లభించే పెద్ద ముళ్ల పండు "డూరియన్"ను కూడా ప్రపంచ పండ్ల రాజు అని కొన్ని దేశాలు భావిస్తాయి. ప్రపంచంలో "క్వీన్ ఆఫ్ ఫ్రూట్" లేదా "పండ్లలో రాణి" అనే గుర్తింపును "మాంగోస్టీన్" అనే పండు చేజిక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా మామిడి పండ్ల ప్రాధాన్యతను గుర్తించిన భారతదేశం 1987లో ప్రారంభించిన "జాతీయ మామిడి దినోత్సవం" లేదా "నేషనల్ మ్యాంగో డే"ను ప్రతి ఏటా 22 జూలై రోజున నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

**మామిడి పండు పోషక విలువలు :**

"మంగీఫెరా ఇండికా" అనబడే శాస్త్రీయ నామం కలిగిన మామిడి పండ్లలో దాదాపు 1,000 రకాలు ఉన్నాయి. అస్సాం, మయాన్మార్ ప్రాంతాల నుంచి ప్రారంభమైన మామిడి పండ్ల ఉనికి నేడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించి అత్యంత ప్రజాదరణ పొందింది. ఫిలిప్పీన్స్‌కు చెందిన "కారాబావో" మామిడి పండ్ల రకం అధిక చక్కెర శాతం, నోటిలో కరిగిపోయే గుజ్జుతో "అత్యంత తియ్యటి మామిడి పండు"గా గిన్నీస్ రికార్డు పొందింది. మామిడి పండ్లలో విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ ఈ, ఖనిజ పోషకాలు పుష్కలంగా ఉంటాయి. జీర్ణక్రియ మెరుగుపడడం, రోగ నిరోధకశక్తి పెరగడం, చర్మం/జుట్టుకు మేలు కలిగించడం, గుండె ఆరోగ్యానికి తోడ్పడడం, దృష్టిని మెరుగుపరచడం, మెదడు ఆరోగ్యం పెంచడం, శరీరాన్ని నిర్విషీకరణ చేయడం, బరువును తగ్గించడం, వేడి తగ్గించడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన మామిడి పండ్లు మార్కెట్‌లో అత్యధికంగా దాదాపు కిలో ధర రూ: 3 లక్షల వరకు పలుకుతాయి. జీవితం ఒక మామిడి పండు లాంటిది. కొద్దిగా పులుపు, ఎంతో తీపి గుజ్జు కలిగిన మామిడి పండును భారత దేశపు "బంగారు ఫలం (గోల్డెన్ ఫ్రూట్)"గా కీర్తించబడుతోంది.

**మామిడి ఫలం రాజధాని – మలిహాబాద్? నగరం:**

భారత్‌లోనే కాకుండా ప్రపంచంలోనే అతి పెద్ద మామిడి ఉత్పత్తి కేంద్రంగా యూపీలోని లక్నో సమీప నగరం మలిహాబాద్?ను "మామిడి రాజధాని" లేదా "క్యాపిటల్ ఆఫ్ మ్యాంగో"గా పిలుస్తున్నాం. భారత్‌లో సాలీనా దాదాపు 230 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి పండ్ల దిగుబడి నమోదు అవుతున్నది. ప్రపంచం మొత్తం మామిడి పండ్లలో 40 – 45 శాతం వాటా ఒక్క భారతదేశానిదే అని గమనించాలి. మామిడి ఉత్పత్తిలో భారత్ స్థానం సుస్థిరంగా ఉన్నది. మలిహాబాద్? నగరం 'దసేరీ మామిడి' రకాలకు ప్రసిద్ధి. బీహార్‌లో లభించే "మియాజాకి" రకం పండ్లను "సూర్యుని గుడ్డు" అని పిలువబడుతూ అత్యంత ఖరీదైన మామిడి పండ్లుగా పేరుగాంచాయి. భారత్‌లో ప్రసిద్ధ మామిడి రకాల్లో దసేరీ, పాండే బంగనపల్లి, పాండే అల్ఫోన్సో, పాండే కేసరి, పాండే లంగ్రా రకాలు ప్రజాదరణ పొందాయి. భారత్‌లో పండే మామిడి పంటలో దాదాపు 25 శాతం కంటే ఎక్కువ యూపీ నుంచే పండుతున్నాయి. యూపీ, ఏపీ, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలు 67 శాతం పండిస్తూ మామిడి ఉత్పత్తిలో ముందున్నాయి.

మామిడి ఉత్పత్తుల్లో పండ్లను నేరుగా తీసుకోవడంతో పాటు పచ్చళ్లు, తాండ్ర, పొడి, జామ్, రసం, లస్సీ, క్యాండిల్స్, పల్ప్, ఎండబెట్టిన ఒరుగు ముక్కలు లాంటివి అనేకం మన జీవితాలతో ముడిపడి ఉన్నాయి. మామిడి కాయల ముక్కలను ఉగాది పచ్చడిలో కూడా వినియోగించడం ఆచారంగా వస్తున్నది. మామిడి పండు లేకుండా వేసవిని ఊహించడం కష్టం. మామిడి పండును తినని వారుండరు. మన సంస్కృతి, వారసత్వాలకు ప్రతీకగా నిలిచిన మామిడి పండ్లను ఆస్వాదిస్తూ ఆరోగ్య సౌభాగ్యంతో జీవితాలను సుసంపన్నం చేసుకుందాం.

# అర్బన్ బ్యాంకు అభివృద్ధే మా ధ్యేయం

**జనసైన్యం సిటి**



కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ గారి సహకారంతో, సహకార మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు మా కమిటీని ప్రభుత్వ జీవో ద్వారా నియమించారు(కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్) తదుపరి ఒక వ్యక్తి హైకోర్టును ఆశ్రయించడం వల్ల ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎన్నికలకు వెళ్లడం జరిగింది. ఆ ఎన్నికల్లో రాజశేఖర్ ప్యానల్ గెలిచింది. ఆ ఎన్నికలు సక్రమంగా జరగలేదని బ్యాంక్ బైలా ప్రకారం, మరియు 1964 సహకార చట్టం ప్రకారం జరగలేదని వరంగల్ సహకార ట్రిబ్యునల్ ను ఆశ్రయించడం జరిగింది. సహకార ట్రిబ్యునల్ ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించి ఎన్నికైన కమిటీ పై స్టేఇచ్చి వివాదాస్పద ఎన్నికలకు ముందున్న నా పిఎసి కమిటీని కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారం జులై 7 రోజున మా కమిటీ బాధ్యతలు స్వీకరించడం జరిగింది. మార్చ్ 31 లోపు బ్యాంకు యొక్క సర్వసభ్య సమావేశం నిర్వహించినందున బైలా ప్రకారం 1964 సహకార చట్టం ప్రకారం ఆ మర్నాడు అంటే ఏప్రిల్ ఒకటి తేదీ నుండి ఆ కార్యవర్గం ఉనికిని కోల్పోతుంది. అంటే ఆటోమేటిక్గా రద్దు అవుతుంది. దీనిపై సహకార అధికారులకు ఎన్ని వినతిపత్రం ఇచ్చినప్పటికీ పట్టించుకోకుండా పోవడం వల్ల హైకోర్టును ఆశ్రయించడం జరిగింది గౌరవ హైకోర్టు గత నెల 23వ తేదీన సహకార అధికారులకు నేనిచ్చిన రిప్రజెంటేషన్ను పరిగణలోనికి తీసుకొని ప్రతివాదులకు నోటీసులు జారీ చేయాలని. నాలుగు వారాల లోపల పీఏసీ కమిటీని కానీ అఫీషియల్ కమిటీని కానీ నియమించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలను అధికారులు ఆమోదించి ట్రిబ్యునల్ ఆర్డర్ ద్వారా ఇప్పటికే మేము పదవిలో కొనసాగుతున్నాం కాబట్టి మా కమిటీ కొనసాగిస్తారని ఆశిస్తున్నాను. గౌరవ జిల్లా మంత్రుల పర్యవేక్షణలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ వేలు చాలా రాజేంద్ర రావు గారి సూచనలతో బ్యాంక్ అభివృద్ధికి మా కమిటీ కృషి చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను ఈ సమావేశంలో మడుపు మోహన్, లక్ష్మణ్ రాజు, అలుగు విద్యాసాగర్ ముక్క భాస్కర్, సందీప్ నాగుల సతీష్ మార్కారాజు పాల్గొన్నారు.

# పిల్లలు నవశఖ నిర్మాతలు

తల్లిదండ్రులే పిల్లలకు
మొదటి ఉపాధ్యాయులు
సంస్కారాన్ని కుటుంబ
విలువలను బంధాలు
అనుబంధాలు
ఆప్యాయత ఆర్ధత
ప్రేమానురాగాలు నేర్పేది
తల్లిదండ్రులే
ప్రతి తల్లి తండ్రి పిల్లలతో
చెప్పగలిగే అత్యంత
అద్భుతమైన
మాట నువ్వు ముందు
ప్రయత్నించు మేము
నీవెంట ఉంటాం
ఈ ఒక్క చిన్న వాక్యం
వారికి భయం లేకుండా
ముందడుగు వేసే ధైర్యం
ఇస్తుంది పట్టుదలను
ప్రేరేపిస్తుంది
అండగా అమ్మానాన్నలు
ఉన్నారనే నమ్మకం పిల్లలకు
రక్షణ భావాన్ని అందిస్తుంది
తల్లిదండ్రులు పిల్లల్లో
చిరునవ్వుల వెనుక దాగి
ఉన్న ప్రతిభను మేల్కొల్పాలి
సరికొత్త ఆలోచనల సృజనను
వారితోనే మొదలుపెట్టాలి
ముందడుగు వేసే చొరవను
వారికి అలవాటు చేయాలి
పిల్లల్లో స్వశక్తి స్వాభిమానం
స్వయం ప్రకాశం సృజన కొత్తదనం
అందించే నిరంతర విజ్ఞానం
జిజ్ఞాస వివేకతను పెంచాలి
పిల్లలను పంజరంలో
పక్షుల్లాగా పెంచకూడదు
అనంత ఆకాశంలో
ఎగిరే డేగలా పెంచాలి
నీడన పెరిగే మొక్కలా కాదు
తుఫానును ఎదురించే మహా వృక్షంలా మార్చాలి
కష్టాలు వస్తే కన్నీరు
పెట్టడం కాదు కనుసైగతో
వాటిని ఎదుర్కోవడం నేర్పాలి
సమర్థతతో సాగే సమస్య
పరిష్కార తత్వం నేర్పాలి
నలుగురిలో ఒకరిగా
మిగిలిపోవడం కాదు
సమాజాన్ని నడిపించే
నాయకత్వం వహించమనాలి
కొత్త తరం సవాళ్లు దీటుగా ఎదుర్కోవాలి
సాంకేతిక విప్లవాన్ని తమకు
అనుకూలంగా మార్చుకోవాలి
ఎ ఐ (కృత్రిమ మేధా) చేతిలో
యంత్రంలా మారడం కాదు
దాన్ని శాసించే మేదస్సులుగా
పిల్లలు ఎదగాలి.
పిల్లల్లో జ్ఞానం వివేకాన్ని పెంచాలి
నిరంతరం నేర్చుకునే జిజ్ఞాసను
నింపాలి సమకాలీన సవాళ్లను
స్థితప్రజ్ఞతతో గెలిచే నిపుణతను
పెంపొందించాలి
జ్ఞానానికి పదును పెడుతూ
కొత్త లోకాన్ని సృష్టించాలి
యంత్రాల యుగంలోనూ
మానవత్వాన్ని చాటాలి.
ఆత్మవిశ్వాసమే ఆయుధంగా
గమ్యాన్ని ముద్దాడాలి
ప్రతి బిడ్డ ప్రపంచానికి
ఆదర్శంగా నిలవాలి
చేతులు చాచి సాయం
అడగడం కాదు
నలుగురికి సాయం చేసే
స్థాయికి చేర్చాలి
ఓటమి ఎదురైతే
కుంగిపోవడం కాదు
గెలుపుకు అది తొలిమెట్టు
అని చెప్పాలి
ఎవరో వస్తారని ఏదో
చేస్తారని వేచి చూసే
గుణం వద్దు ముందడుగు
వేసే చొరవను వారికి
అలవాటు చేయాలి
సమాజపు చీకట్లను
చూసి భయపడడం కాదు
తామే ఒక వెలుగై
నడవాలని నేర్పాలి
తల్లిదండ్రులు పిల్లలకు
ఆస్తులు అంతస్తులు
ఇవ్వకపోయినా పర్వాలేదు
ఆత్మవిశ్వాసము అనే
ఆయుధాన్ని ఇవ్వాలి
తల్లిదండ్రుల నీడలోనే కాదు
తమ స్వసక్తితో బ్రతకడం
నేర్పాలి అపుడే వారు
నిజమైన మనుషులవుతారు
సమాజంలో ధైర్యంగా
అడుగులు వేస్తారు
భయాల చీకట్లను చీల్చే సూర్యులై
సమాజానికి తేజస్సు ఇస్తారు
హిమాలయాలంతా ధైర్యంతో
విశ్వాన్ని జయిస్తారు.



నేదునూరి కనకయ్య

## కొండగట్టు అంజన్న ఆలయంలో వరుణ జపం-వరుణ యాగం



**కొడిమ్యాల , జన సైన్యం న్యూస్.**
ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు తొలగి, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం వైభవంగా వరుణ జపం, వరుణ యాగం నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి (ఈఓ) ఎస్. అంజనారెడ్డి పర్యవేక్షణలో స్థానాచారి కపిందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, అర్చకులు మారుతి ప్రసాద్, చిన్న రాము, వేద పండితులు రాజేశ్వర శర్మ, పెద్దన్న శర్మ, తేజ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు అనుకూలంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని వేద మంత్రోచ్చారణల మధ్య వరుణ జపం, వరుణ యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి (ఏఈఓ) హరిహారనాథ్, సూపరింటెండెంట్లు సునీల్, చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, వేద పండితులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# జాతి గుండె లబ్ డబ్‌లు - జాతీయ జెండా రెపరెపలు

**డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి**

**(22 జూలై "జాతీయ జెండా అమోదించిన దినోత్సవం" శుభ సందర్భంగా)**



భారత జాతీయ జెండా రెపరెపలే 146 కోట్ల భారతీయుల గుండె లబ్ డబ్‌లు. దేశ ఔన్నత్యం, ఐక్యత, దేశ భక్తి, త్యాగం, జాతి గౌరవం, ఆకాంక్షలు, న్యాయం, సార్వభౌమాధికారం, శాంతి, సౌభాగ్యం, స్వేచ్ఛా స్వాతంత్ర్య పోరాటాలకు ఏకైక చిరునామాగా త్రివర్ణ పతాకం నిలుస్తున్నది. జాతీయ పతాకానికి వందనం చేస్తూ మనందరం మన దేశభక్తిని ప్రకటిస్తున్నాం, దేశాభివృద్ధికి బాటలు వేస్తున్నాం. మచిలీపట్నానికి చెందిన తెలుగు బిడ్డ పింగళి వెంకయ్య రూపొందించిన ప్రస్తుత త్రివర్ణ జాతీయ పతాకాన్ని 22 జూలై 1947న మన భారత రాజ్యాంగ సభ ఆమోదించడం, 15 ఆగష్టు 1947న భారత ప్రభుత్వం అధికారికంగా ఎగుర వేస్తూ అంగీకరించడం మన స్వతంత్ర భారత ఘన చరిత్రలో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచి పోయింది. 22 జూలై 1947 రోజు మన జాతీయ పతాకాన్ని ఆమోదించడంతో ప్రతి ఏట జూలై 22న దేశవ్యాప్తంగా భారతీయులు "జాతీయ పతాక ఆమోద దినోత్సవం లేదా జాతీయ పతాక దినోత్సవం ( నేషనల్ ఫ్లాగ్ డే ఆర్ నేషనల్ ఫ్లాగ్ అడాప్షన్ డే)" రూపంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది.

**త్రివర్ణ పతాకంలో దాగిన నిగూఢ అనంత అర్థాలు:**

చేనేత వస్త్రంతో మాత్రమే రూపొందించబడుతున్న మన జాతీయ జెండా 2:3 నిష్పత్తితో దీర్ఘ చతురస్రాకారంలో మూడు రంగులతో, మధ్యలో నావీ-బ్లూ రంగు అశోక చక్రం అమర్చబడి అందంగా ఉంటుంది. జాతీయ పతాకంలోని పై భాగంలో "కాషాయ రంగు", మధ్యలో "తెలుపు వర్ణం", క్రింది భాగాన "ఆకు పచ్చ రంగు" సమాన భాగాలుగా అమర్చబడి ఉంటాయి. మధ్యలో ఉన్న తెలుపు వర్ణం కేంద్రంగా నావీ-బ్లూ రంగు కలిగిన "అశోక ధర్మ చక్రం" అమర్చబడి ఉంటుంది. పై భాగాన ఉన్న కాషాయ రంగు దేశ శక్తి సామర్థ్యాలకు, త్యాగ స్ఫూర్తి, ధైర్యాలకు ప్రతీకగా నిలుస్తున్నది. మధ్యలో ఉన్న శ్వేత వర్ణం శాంతి, స్వచ్ఛత, సత్యాలను సూచిస్తున్నది. క్రింది భాగాన ఉన్న హరిత వర్ణం సమృద్ధి, హరిత సంపద, శుభ ప్రదం, సమగ్రాభివృద్ధిలను ప్రకటిస్తున్నది. మధ్య తెలుపు వర్ణం కేంద్రంగా సత్య ధర్మాలకు ప్రతీకగా అశోక ధర్మ చక్రం అమర్చబడి ఉన్నది. అశోక చక్రం ప్రగతి రథాలకు చిరునామాగా, చక్రంలోని 24 చువ్వలు స్వేచ్ఛ భారత స్ఫూర్తి, 24 గంటలు నిరంతర ప్రగతి పరుగులను ప్రకటిస్తున్నది. చక్రంలోని సారనాథ్ సింహం ధైర్య, గంభీర, న్యాయ, సుస్థిరతను సూచిస్తున్నది.

**భారత జాతీయ పతాక చరిత్ర :**

07 ఆగష్టు 1906న తొలిసారి ఆకు పచ్చ, పసుపు, ఎరుపు వర్ణాలతో కూడిన జాతీయ పతాకాన్ని అనధికారంగా కలకత్తాలో ఎగురవేశారు. 1907లో కాషాయం, పసుపు, ఆకు పచ్చ వర్ణాలతో కూడిన జెండాను బెర్లిన్ కమిటీ రూపొందించడం జరిగింది. అనంతరం అన్నీ బిసెంట్, బాల గంగాధర తిలక్‌లతో కూడిన దేశ భక్తులు ఐదు ఎరుపు చారలు, నాలుగు ఆకు పచ్చ చారలు, ఏడు నక్షత్రాలు, ఎడమ పై భాగాన యూనియన్ జాక్ సంతకంతో కూడిన పతాకాన్ని ఎగురవేయడం జరిగింది. 1921లో జరిగిన బెజవాడ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో తెలుగు తేజం పింగళి వెంకన్న రూపొందిందని 30 రకాల పతాక నమూనాల్లోంచి ఐదింటిని అనధికారికంగా ఎంపిక చేశారు. 1931లో వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకం, మధ్యలో "చరకా" చేర్చబడింది. దేశ స్వాతంత్ర్యానికి కొద్ది రోజుల ముందు నేటి మన జాతీయ పతాకానికి తుది రూపం ఇస్తూ త్రివర్ణ పతాకం మధ్య భాగంలో "చరకా"కు బదులుగా "అశోక ధర్మ చక్రం" చేర్చబడింది. ఈ జాతీయ జెండాను 22 జూలై 1947న భారత రాజ్యాంగ సభ అధికారికంగా ఆమోదించడం ఒక అపూర్వ ఘట్టంగా దేశ స్వాతంత్ర్య చరిత్రలో నిలిచి పోయింది.

**జాతీయ జెండా నియమ నిబంధనలు:**

ప్రతి భారత పౌరుడు తన ఇంటి ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగుర వేసుకోవచ్చని 2002లో కోడ్ సవరణ చేయడం, 2005లో మరి కొన్ని అదనపు వాడుకలను అనుమతించడం జరిగింది. మన జాతీయ జెండాను ఉదయం ఎగుర వేసి సాయంత్రం సూర్యాస్తమయానికి ముందు వరకు ఉంచుకోవచ్చని, మతపరమైన సందర్భాల్లో వాడకూడదని, నేలకు గాని నీటికి గాని తగలకుండా చూసుకోవాలని, జాతీయ జెండా కన్న ఎత్తులో మరో జెండా ఉండకూడదనే నియమనిబంధనలు కూడా చేర్చబడినవి. జెండా ఎగుర వేసిన వెంటనే జాతీయ గీతాన్ని ఆలపించడం మనకు ఒక అలవాటుగా మారిపోయింది.

భరతమాత గుండె సవ్వడిగా నిలుస్తున్న మన జెండాకు మనందరం వందనం చేస్తూ, దాని ప్రాభవ వైభవాలకు అనునిత్యం కృషి చేస్తూ, దాని ప్రతిష్టను ఇనుమడింపజేస్తూ, మన జాతీయ పతాకానికి భక్తి శ్రద్ధలతో మనసారా నమస్కరిద్దాం. మన త్రివర్ణ పతాకాన్ని మదిలో నిలుపుకొని దేశాభివృద్ధి, ఐక్యత, శాంతి సామరస్యాల స్థాపనకు కృషి చేద్దాం.

# అంగరంగ వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం




ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ . భక్తులు, పుర ప్రముఖులు అధిక సంఖ్యలో అమ్మ వారి కళ్యాణాన్ని తిలకించారు. బల్కంపేట్ ఎల్లమ్మ అమ్మ వారి కళ్యాణ మహోత్సవం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి తిలకించారు. తదుపరి అమ్మవారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా సీఎం కుటుంబ సభ్యులు, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులు, కొండా సురేఖ కుటుంబ సభ్యులు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ కుటుంబ సభ్యులు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య రెడ్డి, శాసనసభ్యులు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, నవీన్ యాదవ్ ల రాకతో దేవాదాయ శాఖ అధికారులు ఆలయ మర్యాదలతో గౌరవ స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ అమ్మ వారి కళ్యాణం తిలకించేందుకు వచ్చే భక్తులు, పుర ప్రజలకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మెరుగైన వసతులు కల్పించడం జరిగింది. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ చైర్మన్ సాయిబాబా, కళ్యాణ మహోత్సవ నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు. త్రాగునీరు విద్యుత్ నిరంతరంగా ఏర్పాటు చేపట్టారు. భక్తులకు ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరికి అమ్మవారి కళ్యాణం తికలించేలా, దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేపట్టారు. కళ్యాణం తదుపరి కూడా అమ్మవారిని దర్శించుకొనుటకు భక్తులు ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు.



ఈ కళ్యాణ మహోత్సవంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా,డిసిపి ట్రాఫిక్ కాజల్ సింగ్, జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, ఈవో వినోద్ రెడ్డి, విద్యుత్ జిహెచ్ఎంసి, హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్, మెడికల్, రెవెన్యూ, దేవాదాయ శాఖ, పోలీస్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త






బ్యాడ్మింటన్ . టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు రంగంలో ఆసక్తిగలవారికి గంటకు 300 రూపాయల చొప్పున కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు ఇవ్వబడును. ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి ఇవ్వబడును

బుకింగ్ చేసుకోవాల్సిన ఫోన్ నెంబర్ 9246966660






## ఆట వేళలు


ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660








జనచిత్రం

## రన్నింగ్ కాలమ్



హిందువులకు బొట్టు
తప్పనిసరి చేస్తాడట
ధర్మం పేరుతో కొత్త
రాజ్యాంగం రాస్తాడట

సంప్రదాయం సరేగాని
వృద్ధి గురించి మాట్లాడు
గెలిపించిన రాష్ట్రానికి
నిధుల కోసం కొట్లాడు

-పెనుగొండ బసవేశ్వర్..

# సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన మంత్రి అడ్లూరి

జనసైన్యం సిటి



బుగ్గారం మండలం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం రోజున నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు పాల్గొని అర్హులైన 44 మంది లబ్ధిదారులకు 15,98,500 రూపాయల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర సమయంలో అండగా నిలిచే గొప్ప సంక్షేమ పథకమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని కుటుంబాలకు ప్రభుత్వం సకాలంలో సహాయం అందిస్తూ వారి జీవితాల్లో భరోసా నింపుతోందని తెలిపారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రజా సేవే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు.

# ఘనంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



జనసైన్యం సిటి

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్వాల కార్తీక్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి 58వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా అలువల కార్తీక్ మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి జన్మదినని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థిని విద్యార్థుల మధ్యలో భారీ ఎత్తున కేకు కట్ చేసి సంబరాలు చేసుకోవడం జరిగింది వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో నాయిని రాజేందర్ రెడ్డి గారికి ఉన్నతమైన పదవులు చేపట్టి వరంగల్ పశ్చిమను అభివృద్ధి పథంలో నడుపుతూ వరంగల్ పశ్చిమ ప్రజల యొక్క ఆదరణ పొందుతూ ముందుకు సాగుతున్న రాజేందర్ రెడ్డి గారికి అష్టైశ్వర్యాలు సుఖసంతోషాలు వర్ధిల్లాలని కోరుకుంటూ వరంగల్ పశ్చిమను తెలంగాణలోనే అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలని ఆ మనసారా దేవుని కోరుకుంటూ ఇలాంటి అవకాశం కల్పించినటువంటి నాయని రాజేందర్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ తీగల ప్రేమ్చంద్ డాక్టర్ ఓ రాజేందర్ మట్టెడ కుమార్ మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాంబరాజు రాజకుమార్ ఎండి జాఫర్ భీమ వినయ్ కుమార్ మమ్మద్ కుర్షిత్ మార్త వరుణ్ బాబు శివకుమార్ యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్యామ్ సౌరం రాహుల్ వర్ధన్ యువజన కాంగ్రెస్ నాయకులు మింటూ ఇల్లందుల వివేక్ లక్కీ గాద వివేక్ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# కుమ్మరిపల్లె తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో మంత్రి పర్యటన

జనసైన్యం సిటి



వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లె తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో గత కొన్ని రోజులుగా విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి, వర్షం కురుస్తున్నప్పటికీ విద్యార్థుల సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి ఈరోజు బోర్‌వెల్ తవ్వకాలకు భూమిపూజ నిర్వహించి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్‌ను ప్రారంభించి విద్యార్థుల కోసం అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా విద్యార్థులు తమ పాఠశాలలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తదుపరి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అందుతున్న భోజనం నాణ్యత, విద్యా బోధనపై ప్రత్యేకంగా ఆరా తీశారు. విద్యార్థులకు భోజనం, చదువు విషయంలో ఎలాంటి లోపాలు, ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతుల కల్పనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పదేళ్ల బీఆర్ఎస్ పాలన అవినీతి, అసమర్థతకు నిదర్శనం





జనసైన్యం సిటి

తెలంగాణలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న అప్పటి టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచిందని ఓబీసీ విభాగం రాష్ట్ర నాయకుడు సుతారి లక్ష్మన్ బాబు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి మంధేన వెంకటేష్ విమర్శించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని, ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని, ఉద్యమకారులకు న్యాయం చేస్తామని, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామని హామీలు ఇచ్చి వాటిని అమలు చేయలేదన్నారు. నిరుద్యోగులకు సకాలంలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకుండా యువతను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆరోపించారు. తమ హామీల అమలులో విఫలమైన బీఆర్ఎస్ నాయకులు ముందుగా ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఇతర పార్టీలపై విమర్శలు చేసే ముందు గత పాలనపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీల అమలుతో పాటు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, రైతు రుణమాఫీ, ఉద్యోగ నోటిఫికేషన్లు, పరిశ్రమల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ విద్య, వైద్య రంగాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటూ ప్రజాపాలనను ముందుకు తీసుకెళ్తోందన్నారు. తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు మళ్లీ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, గత అనుభవాల నేపథ్యంలో ప్రజలు వారి మాటలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన తీర్పు ఇస్తారని, రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని సుతారి లక్ష్మన్ బాబు, మంధేన వెంకటేష్ పేర్కొన్నారు.

# డా. చలిమెడ రాజేశ్వర్ రావును ఘనంగా సత్కరించిన యాదగిరి సునీల్ రావు



జనసైన్యం సిటి

అమెరికాకు చెందిన మేరీల్యాండ్ యూనివర్సిటీ నుండి ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ అందుకున్న కరీంనగర్ డైరీ చైర్మన్ చలిమెడ రాజేశ్వరరావు ను సప్తగిరి కాలనీలోని తన నివాసంలో... బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. గత 40 సంవత్సరాలుగా కరీంనగర్ డైరీని విజయపథంలో నడిపిస్తూ, పాడి పరిశ్రమలో ఆయన చేసిన విప్లవాత్మకమైన కృషికి, విశేష సేవలకు గుర్తింపుగానే మేరీల్యాండ్ యూనివర్సిటీ ఈ గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేయడం జరిగిందని సునీల్ రావు కొనియాడారు. వేలాది మంది పాడి రైతుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ, వారికి సన్మార్గం చూపుతూ కరీంనగర్ డైరీకి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంలో రాజేశ్వరరావు పాత్ర ఎనలేనిదని ప్రశంసించారు. ఇదే రెట్టించిన ఉత్సాహంతో రాబోయే రోజుల్లో కరీంనగర్ డైరీ పేరును దేశవ్యాప్తంగా మారుమ్రోగేలా మరింతగా కృషి చేయాలని, పాడి పరిశ్రమ అభివృద్ధికి మరిన్ని నూతన కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ, డాక్టరేట్ పొందిన శుభ సందర్భంగా రాజేశ్వరరావు కు సునీల్ రావు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఢిల్లీలో విద్యార్థుల, యువతపై పోలీసుల లాఠీచార్జీ అమానుషం



**జనసైన్యం సిటి**

ఢిల్లీలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చలో పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జీ చేయడం అత్యంత అమానుషమైన చర్య అని, ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు ఉందని, అలాంటి హక్కును అణిచివేసే విధంగా పోలీసులు లాఠీ ఛార్జ్ చేస్తూ, టియర్ గ్యాస్ ప్రయోగించిన విద్యార్థులు యువకులు పార్లమెంట్ ను తాకి నిరసన చెప్పారని, నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు, 2024, 2026లో నీట్ పేపర్ లీకేజ్ పరీక్ష ఫలితాల్లో తప్పుల వల్ల లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్టీఏ సంస్థ చెలగాటమాడుతుందని, బిజెపి పాలిత రాష్ట్రాలు ఉత్తర ప్రదేశ్, బిజెపి, గుజరాత్ లోనే వరుసగా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని, పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా విద్యార్థులు యువకులు డిమాండ్ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, నీటి పరీక్ష నిర్వహణను రాష్ట్రాలకు ఇవ్వకుండా కేంద్రం ఆధీనంలో పెట్టుకొని రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని, ఢిల్లీలో నిరసన తెలుపుతున్న వారిపై లాఠీ చార్జీలు చేయడం కాదు నీట్ పేపర్ లీకేజ్ దోషులను కఠినంగా శిక్షించి, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ద్వారా విద్యార్థులకు న్యాయం జరుగుతుందని,విద్యార్థులు, యువత సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సింది పోయి వారిపై బలప్రయోగానికి దిగడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. విద్యార్థుల గొంతును లాఠీలతో మూయాలని చేసే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవు. ఉద్యమాలను అణచివేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావు. ఏఐఎస్ఎఫ్ తెలంగాణ కరీంనగర్ జిల్లా సమితి తరపున ఢిల్లీ పోలీసుల లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తున్నాము. గాయపడిన విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్య సహాయం అందించాలి. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు, యువత డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని మచ్చ రమేష్ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## స.హ.చట్టం ద్వారా కోరిన సమాచారం ఇవ్వకుండా దాటవేసిన పీఐఓ.పై ఫిర్యాదు

కొడిమ్యాల, జన సైన్యం న్యూస్.



సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద కోరిన సమాచారాన్ని పూర్తి స్థాయిలో అందించకుండా దాటవేసిన అసిస్టెంట్ ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పీఐఓ)పై ఫిర్యాదు చేసినట్లు ఆర్టీఐ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026 మే 19న సమాచార హక్కు చట్టం ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధూపదీప నైవేద్య పథకం కింద పనిచేస్తున్న పూజారుల సంఖ్య, వారు విధులు నిర్వహిస్తున్న దేవాలయాల వివరాలు, వారి పేర్లు, వారికి అందుతున్న పారితోషికం వివరాలను కోరుతూ దరఖాస్తు చేసినట్లు తెలిపారు.అదేవిధంగా కొడిమ్యాల, మల్యాల మండలాల్లోని దేవాలయ భూముల లీజు వేలం ప్రక్రియ, వాటి ద్వారా వచ్చిన ఆదాయం, ఆ నిధుల వినియోగానికి సంబంధించిన పూర్తి వివరాలు, అలాగే వివిధ దేవాలయాల్లో అవుట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య, వారి వివరాలను కూడా కోరినట్లు చెప్పారు.అయితే కోరిన సమాచారాన్ని అందించకుండా, సంబంధిత దేవాలయాల ఈవోల వద్ద నుంచి సమాచారం పొందాలని మాత్రమే లేఖ ద్వారా తెలియజేశారని రవీందర్ ఆరోపించారు.సమాచార హక్కు చట్టం ప్రకారం పీఐఓ అందించాల్సిన సమాచారాన్ని ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ ఎండోమెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు అక్కపెల్లి రవీందర్ తెలిపారు.

## మల్లంపెల్లిలో వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన సదస్సు



**జనసైన్యం సిటి**

అక్కన్నపేట మండలంలోని మల్లంపెల్లి గ్రామంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి యాజమాన్యం, పంటల సంరక్షణ తదితర అంశాలపై విస్తృత స్థాయి అవగాహన మరియు సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్‌గా సిద్దిపేట జిల్లా ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ భార్గవ్ గారు హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ రైతు ఆత్మ డివిజన్ చైర్మన్ జంగపల్లి ఐలయ్య గారు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంది తిరుపతి రెడ్డి గారు, ఎంపీడీవో జయరాం గారు, మండల వ్యవసాయ అధికారి (ఏవో) తస్లీమా బేగం గారు, మల్లంపెల్లి గ్రామ సర్పంచ్ ఇస్తారి కొమురయ్య గారు, ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జంగపల్లి ఐలయ్య గారు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంపిక చేసుకోవడం, పంటల మార్పిడి విధానాన్ని పాటించడం, వర్షపు నీటిని సంరక్షించడం, నేలలో తేమను నిల్వ ఉంచే చర్యలు చేపట్టడం ద్వారా వర్షాభావ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించే సలహాలను తప్పనిసరిగా పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.స్పెషల్ ఆఫీసర్ విజయ భార్గవ్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అందించే సాంకేతిక సూచనలు, ప్రభుత్వ పథకాలు, పంట బీమా, రైతు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంది తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, రైతులు మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని, వ్యవసాయ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు.ఎంపీడీవో జయరాం గారు గ్రామస్థాయిలో వర్షపు నీటి సంరక్షణ, చెరువులు, కుంటలు, ఇంకుడు గుంతల నిర్వహణ వంటి చర్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి తస్లీమా బేగం విత్తనాల ఎంపిక, ఎరువుల సమతుల్య వినియోగం, పంటల సంరక్షణ, పురుగుల నివారణ, నీటి పొదుపు సాగు పద్ధతులపై రైతులకు సవివరంగా అవగాహన కల్పించారు.సమావేశంలో రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. వర్షాభావ పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చని సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు రైతులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

## వాంగ్ చుక్ పై కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక కఠిన చర్య



డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్



ఢిల్లీ వేసవి ఎండలో 21 రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తూ, కేవలం ఉప్పు నీరు మాత్రమే స్వీకరిస్తూ, న్యాయం కోసం నిశ్శబ్దంగా ఎదురుచూస్తున్న వ్యక్తిని శనివారం ఉదయం ఢిల్లీ పోలీసులు బలవంతంగా అపహరించారు. ఈ ఘటన భారత ప్రజాస్వామ్యంలోని అసౌకర్య సత్యాన్ని మరోసారి బయటపెట్టింది: నిరసనకు ప్రజాస్వామ్యబద్ధమైన మార్గాలు మూసుకుపోతున్నాయి, అసమ్మతి స్వరాలను అణచివేయడానికి రాజ్యాంగ యంత్రాంగం ఎంతవరకు ముందుకు వెళ్తుందో ఈ సంఘటన చాటిచెప్పింది.

59 ఏళ్ల పర్యావరణ ఉద్యమకారుడు, విద్యాసంస్కర్త సోనమ్ వాంగ్ చుక్ జూన్ 28న జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. నీట్ (ఎన్ఈఈటీ) ప్రశ్నాపత్రం లీక్ కాండతో సహా జాతీయ స్థాయి పరీక్షల్లో పునరావృతమవుతున్న అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టీ.ఏ.)ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వాస్తవానికి 2026 మే 3న నిర్వహించిన (నీట్-యూజీ) పరీక్షను పేపర్ లీక్ ఆరోపణలతో రద్దు చేయడం, ఇందుకు సంబంధించి సీబీఐ దర్యాప్తు ఆదేశించడం జరిగింది. ఈ పరీక్ష 2.28 మిలియన్ల మంది అభ్యర్థుల భవిష్యత్తును ప్రభావితం చేసింది. 'కాక్రోచ్ జనతా పార్టీ' (బీజేపీ) అనే వ్యంగ్యాత్మక ఆన్లైన్ ఉద్యమం ఈ సమస్యను జాతీయ దృష్టికి తెచ్చింది.

వాంగ్ చుక్ ఆరోగ్య పరిస్థితి దినదినాభివృద్ధి క్షీణిస్తుండడంతో ఢిల్లీ హైకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, అవసరమైతే వైద్య సహాయం అందించాలని ఆదేశించింది. శుక్రవారం నాటికి వాంగ్చుక్ 9.1 కిలోల బరువు కోల్పోయారు, ఆయన శరీరం కొవ్వు, కండరాలను విచ్ఛిన్నం చేసుకుంటున్న దశలో ఉంది. వైద్యులు ఆయన రక్తంలో పొటాషియం స్థాయి 4.3 నుండి 2.9కి పడిపోయినట్లు నిర్ధారించారు. ఇది ప్రమాదకరమైన స్థాయి అని, తక్షణ చికిత్స అవసరమని వారు అభిప్రాయపడ్డారు.

అయితే శనివారం ఉదయం 6.30 గంటలకు జరిగినది ఎంతో భిన్నంగా ఉంది. తమను ప్రభుత్వ వైద్యులమని చెప్పుకుంటూ వచ్చిన ఢిల్లీ పోలీసులు, వేదికపైకి దూసుకెళ్లి, వాంగ్ చుక్ పై తెల్లటి బెడ్షీట్ కప్పి, స్ట్రెచర్పై ఎక్కించి సఫ్దర్జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఆయన అనుమతి కోరలేదు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వలేదు, ఆయన వ్యక్తిగత వైద్యులను దూరంగా ఉంచారు. దీనికి కొంతముందే జంతర్ మంతర్ వద్ద మొబైల్ ఫోన్లు పనిచేయకుండా జామర్లు ఏర్పాటు చేశారు. సంఘటన జరిగిన వెంటనే ప్రపంచానికి తెలియకుండా ఉండేందుకు ఇది ఒక ప్రణాళికాబద్ధమైన వ్యూహమని స్పష్టమవుతోంది.

ఈ బలవంతపు తరలింపు చట్టబద్ధమైనదేనా? ఢిల్లీ పోలీసులు హైకోర్టు ఆదేశాలను, వైద్య సలహాను ఆధారంగా చూపారు. కానీ హైకోర్టు ఎక్కడా 'బలవంతంగా తరలించాలని' ఆదేశించలేదు. ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని, అవసరమైతే చికిత్స అందించాలని మాత్రమే చెప్పింది. వాంగ్చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో 'మా అనుమతి లేకుండా ఎటువంటి చికిత్స అందించవద్దని' డిమాండ్ చేశారు. ఆమె సఫ్దర్జంగ్ ఆసుపత్రిలో చూపిన పొటాషియం స్థాయి (2.9)పై అనుమానం వ్యక్తం చేశారు. స్వతంత్ర ల్యాబ్ పరీక్షలో 3.6 నమోదు కాగా, ఆమె దీనిని సవాలు చేశారు. ఆమె ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి, సఫ్దర్జంగ్ ఆసుపత్రిలో ఆయన కొనసాగడాన్ని 'అక్రమ నిర్బంధం'గా పేర్కొన్నారు.

ఈ చర్య వెనుక రాజకీయ ఉద్దేశం కూడా ఉందనడానికి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. శుక్రవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సీనియర్ ఐపిఎస్ అధికారి అనురాగ్ కుమార్ ను ఢిల్లీ పోలీస్ కమిషనర్ గా నియమించింది. ఆయన గతంలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) స్పెషల్ డైరెక్టర్గా పనిచేశారు. నియామకం మరుసటి రోజే ఈ కఠిన చర్య జరగడం, ఆయనకు ఇదే మొదటి బ్రీఫింగ్ అయితే 'అది చాలా చిల్లింగ్ మెసేజ్ పంపుతుంది' అని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా విమర్శించారు. అదే సమయంలో ప్రతిపక్షాలు ఈ చర్యను తీవ్రంగా ఖండించాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 'అసత్య, హింసలే మోదీ ప్రభుత్వపు మూలసూత్రాలు' అని పేర్కొన్నారు. మల్లికార్జున్ ఖర్గే 'ఈ నిరంకుశ ప్రభుత్వం ఎవరినీ వదిలిపెట్టడం లేదు' అని ఆరోపించారు. అరవింద్ కేజ్రీవాల్ 'బలవంతంగా ఎత్తుకెళ్లే బదులు ప్రభుత్వం మాట్లాడి ఉండాలి' అని అభిప్రాయపడ్డారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ ఈ చర్యను 'సర్వాధికార వైఖరి'గా అభివర్ణించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా 'సంభాషణ, జవాబుదారీత్వంపై బలప్రయోగానికి ప్రాధాన్యం' ఇచ్చారు అని విమర్శించారు.

వాంగ్ చుక్ ను తరలించిన వెంటనే బీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే జంతర్ మంతర్ వద్దే నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయన మాట్లాడుతుండగా సంఘ్ పరివార్ మద్దతుదారు ఒకరు ఆయనపై సిరా చల్లడం గమనార్హం. ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఆదర్శ్ ఎం సాజీ, సంయుక్త కార్యదర్శి ఐషీ ఘోష్ కూడా 'క్రాంతి కార్నర్' వద్ద నిరాహార దీక్షకు దిగారు. వాంగ్చుక్ విడుదలయ్యే వరకు దీక్ష కొనసాగిస్తామని వారు ప్రకటించారు.ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, వంటి విద్యార్థి సంఘాలు కూడా ఈ ఉద్యమంలో చేరాయి.

ఈ బలవంతపు తరలింపు గురించి మూడు కీలకమైన అంశాలు స్పష్టమవుతున్నాయి. మొదటిది, వైద్య ఆందోళనలను సాకుగా చూపి, ప్రజాస్వామ్య నిరసనను అణచివేసే పద్ధతికి ఇది ఒక ఉదాహరణ. వాంగ్ చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్నా, ఆయనకు కావాల్సింది వైద్య చికిత్స కాదు, న్యాయం. 21 రోజుల పాటు ఆయన డిమాండ్లపై ప్రభుత్వం నామమాత్రంగా కూడా స్పందించలేదు. అయితే వేలాది మంది విద్యార్థులు, యువత పార్లమెంట్ మార్చ్ కు సిద్ధమవుతున్న సమయంలో ఆయనను తొలగించడం, ఆ మార్చ్ ను అడ్డుకునే ప్రయత్నంగా కనిపిస్తుంది. రెండవది, ఈ ఘటన ప్రజాస్వామ్య వ్యవస్థలో 'శాంతియుత నిరసన' అనే ప్రాథమిక హక్కుపై ప్రశ్నలు లేవనెత్తింది. సెక్షన్163 బిఎన్ఎస్-ఎస్ కింద న్యూఢిల్లీ జిల్లాలో నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి. కానీ శాంతియుతంగా, నిశ్శబ్దంగా, ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా ఉన్న వ్యక్తిని బలవంతంగా తరలించడం అనేది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. మూడవది, ఈ సంఘటన రాజకీయ ప్రతిపక్షాలను, విద్యార్థి సంఘాలను, సామాజిక ఉద్యమకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. అన్నా హజారే కూడా కేంద్ర ప్రభుత్వం వాంగ్ చుక్ తో మాట్లాడాలని పిలుపునిచ్చారు.

వాంగ్ చుక్ ప్రస్తుతం సఫ్దర్జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. ఆయన ఇంకా నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఆయన ఇంట్రావీనస్ ఫ్లూయిడ్స్, మందులు తీసుకోవడానికి నిరాకరించారు. ఆయన భార్య గీతాంజలి హైకోర్టులో తమ పిటిషన్ను కొనసాగిస్తున్నారు. బీజేపీ 'చలో సంసద్' మార్చ్ ను జూలై 20న నిర్వహిస్తామని ప్రకటించింది. కానీ పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ మార్చ్ జరుగుతుందా, ఎలా జరుగుతుందనేది ప్రజాస్వామ్య పరీక్షగా మారింది.

భారతదేశంలో నిరసనలు, ఉద్యమాల చరిత్రలో ఇది మరో అధ్యాయం. ఎమర్జెన్సీ కాలం నుండి నేటి వరకు, అసమ్మతి స్వరాలను అణచివేసే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కానీ ప్రతిసారీ ప్రజలు మరింత బలంగా, మరింత నిశ్చయంగా ముందుకు వచ్చారు. ఈ సంఘటన కూడా అలాంటి ఒక మలుపు కావచ్చు. ఎందుకంటే ఇక్కడ ప్రశ్న వాంగ్ చుక్ ఒక్కరి నిరసన మాత్రమే కాదు. ఇది భారతదేశంలోని ప్రతి పౌరుని ప్రాథమిక హక్కుల ప్రశ్న, ప్రజాస్వామ్య విలువల ప్రశ్న, ప్రభుత్వాల జవాబుదారీత్వం గురించిన ప్రశ్న. ప్రభుత్వం ఎంత బలప్రయోగం చేసినా, నిజం, న్యాయం కోసం గొంతెత్తే వారిని ఎప్పటికీ అణచివేయలేము. ఎందుకంటే ప్రజాస్వామ్యం అనేది ప్రభుత్వాల బలం పై కాదు, ప్రజల విశ్వాసంపై నిలుస్తుంది.

## తిరుపతిలో న్యూ విజన్ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన



**జనసైన్యం సిటి**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామానికి చెందిన న్యూ విజన్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నారు. తిరుపతిలోని మీనాక్షి నృత్య కళానిలయం మహతి ఆడిటోరియంలో అభినయ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య పోటీలలో న్యూ విజన్ స్కూల్ విద్యార్థులు పాల్గొని అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. తమ కళా ప్రతిభతో ప్రేక్షకులను ఆకట్టుకుని ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా అభినయ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు బి.ఎన్. రెడ్డి, నాట్య గురువు నాట్య మయూరి మాస్టర్ శ్రీవాణి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అలాగే న్యూ విజన్ కాన్వెంట్ స్కూల్ కరస్పాండెంట్ గుమ్మల తిరుపతిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కళాభిమానులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## 21వ డివిజన్ వికలాంగుల కాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 21వ డివిజన్ వికలాంగుల కాలనీలో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ. 19 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వికలాంగుల కాలనీలో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు, అవసరమైన అన్ని మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వరాల నర్సింగం , గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం , మున్సిపల్ అధికారులు, వికలాంగుల సంఘ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ వెల్ఫేర్ డిడిని కలిసిన మాల మహానాడు నేతలు



**జనసైన్యం సిటి**

**కరీంనగర్ సోషల్ వెల్ఫేర్ డీడీగా బాధ్యతలు స్వీకరించిన భాగ్యలక్ష్మి గారిని జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కాడే శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.. ఈ సందర్భంగా పలు సమస్యలను నాయకులు డిడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాల్సిందిగా కోరారు.. డిడి ని కలిసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడ కనకయ్య , రాష్ట్ర నాయకులు దామెర సత్యం, పార్లమెంట్ ఇంచార్జ్ బోలుమాల సదానందం, నాయకులు పాఠకుల భూమయ్య, మద్దెల రాజేందర్, చిలుక రామస్వామి, చాతల్ల కృష్ణయ్య తదితరులు ఉన్నారు.**

## డ్యాం నర్సరీని పరిశీలించిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని నర్సరీల నిర్వహణ తీరుపై బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్,మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలోని డ్యామ్ వద్ద ఉన్న మున్సిపల్ నర్సరీలను స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... గత ఆరు సంవత్సరాల క్రితం పట్టణ ప్రకృతి వనాల ఏర్పాటులో భాగంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ నర్సరీలు ప్రస్తుతం పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. గతంలో ఎంతో అద్భుతంగా, పచ్చదనంతో కళకళలాడిన ఈ నర్సరీలలో ఇప్పుడు సరైన నిర్వహణ లేక వెలవెలబోతున్నాయని అన్నారు. ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో, రాబోయే మాసంలో పట్టణ ప్రజలకు ప్రతి ఇంటికి కనీసం మూడు పూల, పండ్ల మొక్కలను పంపిణీ చేయాల్సి ఉందని అయితే, ప్రజలకు అందించాల్సిన మొక్కల పెంపకంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు,నర్సరీల్లో మొక్కల కొరత స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కల పెంపకం మరియు పంపిణీ కోసం ఎటువంటి ముందస్తు సన్నాహాలు చేయకపోవడంపై అక్కడి సిబ్బందిని ఆయన నేరుగా ప్రశ్నించారు. ఈ ఏడాదైనా ప్రజలకు మొక్కలు అందించేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేదో, గతంలో జరిగిన విధంగా పంపిణీ ఎందుకు నిలిచిపోయిందో కారణాలు అడిగి తెలుసుకున్నారు. నర్సరీల దుస్థితిని గమనించిన వెంటనే మున్సిపల్ ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడారు. నర్సరీలలో ఉన్న లోటుపాట్లను వెంటనే సరిదిద్దాలని, గత వైభవాన్ని తీసుకురావాలని ఆదేశించారు. త్వరలోనే మున్సిపల్ అధికారులతో కలిసి నర్సరీల నిర్వహణపై కార్పొరేషన్ స్థాయిలో మేయర్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో మాదిరిగానే నర్సరీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, కరీంనగర్ ప్రజలందరికీ తగినన్ని పూల మరియు పండ్ల మొక్కలు సకాలంలో అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పచ్చదనం పెంపొందించే ఈ కార్యక్రమంలో ఇకపై ఎలాంటి అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## పోలీసింగ్‌లో ప్రజల భాగస్వామ్యమే విజయానికి మూలం



**జనసైన్యం సిటి**

ఇల్లందకుంటలో సీసీ కెమెరాల ప్రారంభం - వనమహోత్సవంలో మొక్కలు నాటిన సీపీ - విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, ప్రజలకు హెల్మెట్లు పంపిణీ - పోలీస్ స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాల వార్షిక తనిఖీలు.

కరీంనగర్ పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం, మంగళవారం ఇల్లందకుంట మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజా భద్రత, పర్యావరణ పరిరక్షణ, విద్యార్థుల అవగాహన, రోడ్డు భద్రత, పోలీసింగ్ బలోపేతానికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదట ఇల్లందకుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా నిఘా వ్యవస్థను ప్రారంభించిన సీపీ, గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, దర్యాప్తులో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ప్రజల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. నేటి మొక్కలే రేపటి తరాలకు జీవనాధారమని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా అత్యవసర పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లు ముద్రించిన ఎగ్జామ్ ప్యాడ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యతో పాటు భద్రతపై కూడా అవగాహన కలిగి ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా స్థానిక ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేసిన సీపీ, హెల్మెట్ ధరించడం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా ప్రాణ రక్షణకు అత్యంత అవసరమని పేర్కొన్నారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, పోలీస్--ప్రజల సమన్వయంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామాల్లో మాదకద్రవ్యాలు, జూదం, సైబర్ మోసాలు, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలపై వెంటనే



పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పర్యటనలో భాగంగా ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ నిర్వహించిన సీపీ, కిట్ ఇన్‌స్పెక్షన్, పెండింగ్ ఫైళ్లు, కోర్ పోలీసింగ్, చట్ట అమలు, క్రైమ్ వెహికల్స్, క్రైమ్ ప్రాపర్టీ, రికార్డులు, ప్రభుత్వ ఆస్తులు, కేసుల దర్యాప్తు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచడంతో పాటు నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ప్రతిపాదిత ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందేలా త్వరితగతిన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. తదుపరి జమ్మికుంట రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, పెండింగ్ ఫైళ్లు, రికార్డులు, ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయ నిర్వహణ, పోలీసింగ్ పనితీరును సమీక్షించారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో హుజూరాబాద్ ఏసీపీ మాధవి, హుజూరాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జమ్మికుంట రూరల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్, ఇల్లందుకుంట ఎస్సై ఎం. క్రాంతికుమార్ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# విద్య ప్రధాన లక్ష్యమైన సర్వతోముఖ వికాసం విఫలమవుతున్నది ఎందుకు ?



వడ్డేపల్లి మల్లేశం

**విద్య ప్రధాన లక్ష్యమైనసర్వతోముఖ వికాసం విఫలమవుతున్నది ఎందుకు ? బోధనాభ్యసన లోపమా? విద్యా విధానం వైఫల్యమా? పాలకుల నిర్లక్ష్యమా ?సమకాలిన సమాజం లోని లొసుగులు ,విద్యార్థులపై దుష్ప్రభావమా?**

శాస్త్రీయమైన విషయాలను, సామాజికపరమైన అంశాలను, పరస్పర జీవన విధానంలోని సామాజిక చింతనను, వ్యక్తి కనీస మర్యాదను కూడా మరిచి నేటి సమాజం ముఖ్యంగా యువత తప్పుదారి పడుతున్న సందర్భం మనకు తెలుసు. యువతతో పాటు అన్ని వర్గాల వారు కూడా తమ బాధ్యతను విస్మరించి, విద్య అభ్యసన కర్తవ్యాలను మరిచి, స్వార్థ చింతనకు మరిగి తోటి వ్యక్తులను కూడా సాటి మానవులుగా చూడకుండా వివక్షత అసూయ అవమానాలతో సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్న తీరు మనందరికీ తెలుసు. మన ప్రవర్తన లోని లోపాలను, దాని పరిణామాన్ని తెలిసినప్పటికీ మౌనంగా ఉండడమే కాదు మరింత రెచ్చిపోయి సామాజిక వ్యతిరేక లక్షణాలను జీర్ణించుకోవడం అంటే కొరివితో తల గోక్కోవడమే అవుతుంది. ప్రస్తుతం మన వ్యవస్థ ఈ పరిస్థితులలో ఉన్న సంగతి మనం నిండు మనసుతో గనుక అంగీకరిస్తే మరింత లోతుగా అధ్యయనం చేయడం ద్వారా వ్యక్తుల మానసిక దుస్థితికి కారణంతో పాటు నివారణ ఉపాయాలను వెతుక్కోవడం ద్వారా రాబోయే తరాలను తీర్చిదిద్దుకునే క్రమంలో మనం ప్రవర్తించవలసి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత విద్యా విధానం,అది పోషిస్తున్న పాత్ర, దాని నేపథ్యం,లక్ష్యాలు, లక్షణాలు, దాని రూపకల్పంలో పాలకవర్గాల పాత్ర, సమాజాన్ని భ్రష్టు పట్టించడానికి సామాజిక పరంగా జరుగుతున్నటువంటి అనర్థాలు సామాజిక రుగ్మతలను మరింత లోతుగా పరిశీలించ వలసిన అవసరం చాలా ఉంది. అప్పుడే మనం మరింత మెరుగైన సమాజాన్ని నిర్మించుకోవడానికి అవకాశం ఉంటుంది.

**మానవ వికాసం - విద్య , సమాజం**

విద్యా లక్ష్యాలను నిర్ధారించే క్రమంలో పలువురు తత్తవేత్తలు మేధావులు, విద్యావేత్తలు, సామాజికవేత్తలు ఒక్కొక్క కోణంలో నిర్వచించినప్పటికీ మౌలికమైనటువంటి అంశాలను మాత్రం ప్రస్తావించిన సందర్భంలో వ్యక్తిత్వ వికాసము దానిని మరో కోణంలో సర్వతోముఖ వికాసాన్ని సాధించేదిగా లక్ష్యాలు ఉండాలని సూచించడం జరిగింది .గాంధీ, అరవిందుడు, రాధాకృష్ణన్, అంబేద్కర్ తో సహా అత్యంత ప్రాచీన కాలంలో బుద్ధుడు కూడా ప్రస్తావించిన అంశాలు శారీరక మానసిక వికాసాన్ని పెంపొందించడం, సమానత్వాన్ని సాధించడం, వివక్షత లేని సమాజాన్ని రూపొందించడం, అంతి మంగా మనుషులంతా సమానమే అనే సార్వజనీన భావనను విషవ్యాప్తం చేయడమే మన భారతీయ విద్యా విధానం యొక్క లక్ష్యం కావాలని నాటి నుండి నేటి వరకు ఆ క్రమంలో నిర్ధారించుకుంటూ నే ఉన్నాము. కానీ సమాజం ఆ వైపుగా వికసించడం లేదు, వ్యక్తి చైతన్యం అసంపూర్ణంగానే మిగిలిపోతుంది, స్వార్థ చింతన తో పాటు సామాజిక అంతరాలను పెంచి పోషించే అమానవీయ సంస్కృతి పరిడ వి ల్లుతుంటే సమాజం యొక్క గమనాన్ని వీలైన మేరకు మార్చకుంటే ఎలా? భవిష్యత్తు తరాలు మనలను క్షమించవు కదా! మనిషిలో మానవత్వాన్ని మేల్కొల్పడం, శారీరకంగా'ఆరోగ్య అభివృద్ధి , మానసికంగా వికాసాన్ని పెంపొందించడం, అన్ని మతాలు సమానమేనని మతం మానవత్వాన్ని పెంపొందించాలని వాదించడం , అంతిమంగా మనుషులంతా సమానమేనని మరింత మెరుగైన వ్యవస్థను స్థాపించుకోవడం విద్యా లక్ష్యాలుగా వాళ్ళు నిర్దేశించి ఉన్నారు. ఆ రకమైనటువంటి లక్ష్యాలను సాధించకపోగా అనేక అనర్థాలు ఆకృత్యాలకు నె లవైనటువంటి ఈ భారతదేశంలో విద్యారంగం ఈ రకంగా నీరు గారి పోవాల్సిందేనా? సమాజం మనుగడకు ఆధార భూతమైనటువంటి వ్యక్తి సామాజిక చింతనతో విశాల హృదయముతో మానవీయ కోణంలో ఆలోచించడం కనీసం ధర్మం. ఆ రకమైనటువంటి ఆలోచన సరళి పాఠశాల స్థాయి నుండి ప్రతి విద్యార్థి లోను ప్రతిక్షేపించగలిగితే మనం ఆశిస్తున్నటువంటి ఉత్తమ సమాజం ఆవిష్కృతం అవుతుంది.

**సర్వతోముఖ వికాససాధనకు అవరోధాలు -**

విద్య ఉపాధి కోసము లాభాల కోసం తిరిగి పాఠ్యాంశాలను బోధించడం కోసం మాత్రమే కొనసాగినప్పుడు ఆ విద్య ద్వారా సామాజిక ప్రయోజనం ఎలా చేకూ రుతుంది? నేర్చిన చదువుతో స్వీయ అనుభవాలను రంగరించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడంతోపాటు నైపుణ్యంతో కూడుకున్నటువంటి ఉన్నత ఆలోచనలతో కూడిన బాధ్యతలను చేపట్టే విధంగా విద్య ఉండాలి. ఏ వృత్తిని చేపట్టామన్నదే కాదు ఏ పనిలోనైనా



బ్రతుకుతెరువు కొనసాగించినప్పుడు తన సమాజాన్ని అర్థం చేసుకోవడం, పరిసరాలతో సర్దుబాటు కావడం, ఘర్షణలకు తావు లేనటువంటి మానవ సంబంధాలను కొనసాగించడం అనే అంశాలు ప్రధానంగా జీవితానికి కొ లమానాలుగా భావిస్తేనే దానికి అర్థం ఉంటుంది. కానీ అధిక వేతనాలు, అధిక సంపాదన, ఆకాశాన్ని అంటే భవనాలు అనే పేరుతో మానవీయ విలువలకు అతీతంగా సాధించిన ఏ రకమైనటువంటి అభివృద్ధి కూడా పురోగతి అనబడదు అని తెలుసుకుంటే మంచిది. ఈ రకమైనటువంటి విద్యా కరికులం ప్రధానంగా అమలులో ఉన్నప్పుడు మాత్రమే తోటి వ్యక్తిని సాటి మనిషిగా చూసే అలవాటు, మానవీయ కోణంలో ఆలోచన, డిగ్నిటీ ఆఫ్ లేబర్ పెరిగే అవకాశం ఉంటుంది. ఈ లక్షణాలే నిజమైన జీవితానికి కొలమానాలుగా భావించవలసి ఉంటుంది."" ఉన్నతమైన స్థాయిలో అధిక వేతనంతో కొనసాగుతున్నటువంటి ఒక వ్యక్తి అమానవీయ సంస్కృతికి పాల్పడితే ఆ వ్యక్తి కంటే ప్రకృతిని నమ్ముకొని కాయకష్టం చేసుకుని బతుకుతున్న సగటు వ్యక్తి గొప్పవాడు అంటే అతిశయోక్తి కాదు కదా!""

కరికులంలో ఆ రకమైన మార్పులను తీసుకురావడంతో పాటు బోధనాభ్యసన ప్రక్రియ కూడా ఉపాధ్యాయులు విద్యార్థుల మధ్యన నిరంతరము చర్చకు సందేహాలను తీర్చుకోవడానికి అవకాశంకూడా అవసరం. ""వీలున్న మేరకు క్షేత్ర పర్యటన అవకాశాలను ముమ్మరం చేయడం ద్వారా సమాజాన్ని పాఠశాలలోకి తీసుకురావడంతో పాటు పాఠశాల విద్యార్థులను ప్రత్యక్ష అనుభవం కోసం సమాజంలోకి తీసుకు వెళ్లడం కూడా బాధ్యతగా తీసుకునే ఉపాధ్యాయ లోకం, అందుకు సహకరించే విద్యార్థులు ఉన్నప్పుడే మనం ఆశించే లక్ష్యాలు నెరవేరుతాయి. విద్యను ఒక సామాజిక బాధ్యతగా గుర్తించవలసినటువంటి పాలకులు లాభసాటి వ్యాపారంగా చూడడం, తగిన స్థాయిలో విద్యకు బడ్జెట్ కేటాయించకపోవడం, ప్రైవేట్ విద్యను ప్రోత్సహించడం, ప్రభుత్వ విద్యను నీరుగార్చే విద్యా వ్యతిరేక చర్యలకు పాల్పడడం కూడా విద్య లక్ష్యాల ను చేరుకోకపోవడానికి కారణం అవుతున్నది. వ్యవసాయ పారిశ్రామిక ప్రకృతి పరమైన అంశాలతో పాటు ఈనాడు ప్రపంచంలో కొరతగా ఉన్నటువంటి నైపుణ్యాలను పెంపొందించే అంశాలతో కూడిన విద్యను ప్రవేశ పెట్టడం ద్వారా మన దేశంలోనే నిపుణులను తయారు చేసుకోవడానికి ఇతర దేశాల మీద ఆధారపడకుండా జీవించడానికి అవకాశం ఉంటుంది. "" ఈ బాధ్యత ముఖ్యంగా పాలకులపై ఉంది. అంతేకాదు పాఠ్యాంశాలలో నైతిక విలువలను బోధిస్తుంటే సమాజంలో క్లబ్బులు పబ్బులు ఈవెంట్లు, మద్యపానం ధూమపానానికి ఏదేచ్ఛగా ప్రభుత్వాలు అనుమతిస్తూ ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నప్పుడు కూడా విద్య లక్ష్యాలను చేరుకోవడం అసంభవమే. ఇక్కడ పాలకులు ఒకవైపు విద్య పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతూనే ఆమాత్రం కూడా అభివృద్ధి చెందకుండా ఇలాంటి సంఘవిద్రోహక చర్యలకు అనుమతించినప్పుడు ఆ సమాజం ఉత్తమ సమాజంగా ఎలా రూపుదిద్దుకుంటుంది? అందుకే విద్య యొక్క సంపూర్ణ లక్ష్యమైన సర్వతోముఖ వికాసం అనేది ఎండమావి గానే మిగిలిపోయింది.దీన్ని సరిదిద్దుకోవడం మన అందరి బాధ్యతగా భావించాలి సుమా !





## బొబ్బిటి శ్రీకాంత్ జన్మదిన శుభాకాంక్షలు

## సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు గాయాలు!

**జనసైన్యం సిటి**



సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సినిమా షూటింగ్‌లో గాయపడ్డారు. గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ఆయన హీరోగా నటిస్తున్నారు. NBK111 వర్కింగ్ టైటిల్‌తో ఈ మూవీ తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ కాకినాడ పోర్టులో జరుగుతోంది. యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా ప్రమాదం!నటుడు మంచు మనోజ్, బాలకృష్ణ ల మధ్య కీలక యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. బాలయ్య మోకాలికి స్వల్ప గాయమైంది. వెంటనే చిత్ర బృందం షూటింగ్‌ను నిలిపివేసి ఆయన్ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

గోపిచంద్, బాలయ్య కాంబినేషన్‌లో వస్తున్న మూవీ..

వీర సింహారెడ్డి తరువాత గోపిచంద్, బాలయ్య కాంబినేషన్‌లో వస్తున్న మూవీ కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలే ఉన్నాయి. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో బాలయ్య గ్యాంగ్ స్టర్ తరహా పాత్రలో కనిపించనున్నారని సమాచారం.

స్పందించిన మూవీ యూనిట్..

'NBK111 షూటింగ్ కాకినాడలో జరుగుతోంది. ఓ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తుండగా నందమూరి బాలకృష్ణగారికి చిన్న మసిల్ టియర్ (కండరాల గాయం)అయింది. వైద్యులు ఓ చిన్న సర్జరీ చేయాలని సూచించారు. సినిమాపై ఆయనకున్న క్రమశిక్షణ, కష్టపడే తత్వం చచీదీఖ111 చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరికీ ఎంతో స్ఫూర్తినిస్తుంది. అభిమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆయన త్వరగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లో పాల్గొనాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.' అని చిత్ర బృందం సోషల్ మీడియాలో తెలిపింది.

## భూభారతి భూసర్వేపై రైతులకు అవగాహన సదస్సు




**కొడిమ్యాల, .జన సైన్యం న్యూస్.**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పోతారం గ్రామంలో తహసీల్దార్ నరేష్ ఆధ్వర్యంలో భూభారతి భూసర్వే--రీసర్వే కార్యక్రమంపై అవగాహన సదస్సు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ, రీసర్వే ద్వారా గ్రామంలో భూ వివాదాలు తగ్గడంతో పాటు ఆధునిక సాంకేతికతను వినియోగించి జియో కోఆర్డినేట్స్ ఆధారంగా ఖచ్చితమైన భూ హద్దులు నిర్ధారించి, ప్రతి రైతుకు ఎల్.పీ.ఎం.మ్యాపులు సిద్ధం చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీవో భగవాన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే దేవరావు, గ్రామ సర్పంచ్, మండల సర్వేయర్ తిరుపతి, గిర్దావర్ తిరుపతి, గ్రామ పాలనా అధికారి అంజలి, గ్రామపంచాయతీ కార్యదర్శి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## "సఫాయి అప్నావో - బీమారీ భగావో" పోస్టర్ ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**జనసైన్యం సిటి**

వర్షాకాలంలో సీజనల్, అంటువ్యాధులను నివారించడమే లక్ష్యంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "సఫాయి అప్నావో - బీమారీ భగావో" ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మంగళవారం కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మరియు పారిశుధ్య పర్యావరణ శాఖ అధికారులతో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 31 వరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, నగరంలో రోజువారీ పారిశుధ్య పనులను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. నగర ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, సంక్షేమ సంఘాల భాగస్వామ్యంతో జీ.వి.పి. పాయింట్లు, మార్కెట్లు, బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు, ఇతర ప్రజా ప్రదేశాల్లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి తొలగించడం, చెత్తాచెదారం పూర్తిగా తొలగించడం, డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను శుభ్రం చేయడం, దోమల నివారణ కోసం యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటి చర్యలను విస్తృతంగా చేపడతామని తెలిపారు. కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ - ఎడ్యుకేషన్ - కమ్యూనికేషన్ (IEC) కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, వెల్ఫేర్ గ్రూపులు, హోటల్, రెస్టారెంట్, మార్కెట్ అసోసియేషన్‌లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి నగర పరిశుభ్రత, సోర్స్ లెవల్ సెగ్రిగేషన్, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. నగరంలోని డ్రైనేజీలు, పెద్ద నాళాలు, కాలువలు, ఓపెన్ ప్లాట్లను పూర్తిగా శుభ్రపరచి వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరువులు, కుంటల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు.

పారిశుధ్య కార్మికులకు వ్యర్థాల వేరు చేయడం, డోర్ టు డోర్ చెత్త సేకరణ, సెగ్రిగేషన్, పీపీఈ కిట్ల వినియోగంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా స్లమ్ ప్రాంతాల్లో 100 శాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ, మెరుగైన పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. పబ్లిక్, కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్వహణను మెరుగుపరచడంతో పాటు వాటి మరమ్మతులు చేపట్టి పరిశుభ్రంగా ఉంచుతామని, వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

నగరంలోని పార్కులు, హెరిటేజ్ ప్రాంతాలు, స్ట్రీట్ ఫుడ్ జోన్‌లు, మార్కెట్ ప్రాంతాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. "నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దడంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో కీలకం. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. జూలై 31 వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలి. కరీంనగర్‌ను క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి" అని మేయర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కమిషనర్లు ఆయాజ్, సువార్త, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్, డీఈ లచ్చిరెడ్డి, వెటర్నరీ అధికారి దుర్గాప్రసాద్ రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్లు స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారంలో ఉన్న సమయాన్ని కేటీఆర్ కు రైతులు కనిపించలేదు..



**జనసైన్యం సిటి**

అధికారంలో ఉన్న సమయంలో కేటీఆర్ కు రైతులు, రైతుల సమస్యలు గుర్తుకు రాలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలో మంత్రి అడ్లూరి పర్యటించారు. ఈ సందర్భంగా నంది మేడారం, రచ్చపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఏనాడు రైతుల సమస్యలు పట్టించుకోలేదని మంత్రి ఆరోపించారు. అధికారం దూరమైన తర్వాత కేటీఆర్ రైతుల పరామర్శ పేరట డ్రామాలు వాడుతున్నారని లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. కొండగట్టు బస్సు ప్రమాదంలో మరణించిన బాధ్యత కుటుంబాలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు పరామర్శించలేదని మంత్రి ప్రశ్నించారు. ఒకవైపు ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక రాష్ట్ర రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో రైతులకు అండగా ఉండి వారికి మనోధైర్యం కల్పించాల్సిన బాధ్యత మరిచి ప్రతిపక్ష నాయకులు వ్యవహరిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. నంది మేడారం రిజర్వాయర్ నిర్మాణ సమయంలో నంది మేడారం గ్రామస్తులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మిస్తామని నాటి మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట ఇచ్చి తప్పారని మంత్రి ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.



# పెట్ షాప్పై కేసు నమోదు



**జనసైన్యం సిటి**
కరీంనగర్లోని విద్యానగర్లో గల శ్రీనిక పెట్ షాపులో మూగజీవాలను తీవ్రంగా హింసిస్తున్నారంటూ 'స్టే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' ప్రతినిధి అడులాపురం గౌతమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి బోర్డు అనుమతులు లేకుండా ఈ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారని ఆరోపించారు. నిర్వాహకులు జంతువులకు కనీస వసతులు, ఆహారం, వైద్యం అందించలేదన్నారు. దీనిపై స్పందించిన టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పాతర్లపల్లి గ్రామంలో భూభారతి- రీ సర్వే నిర్వహించుటకు కొరకు గ్రామసభ



**జనసైన్యం సిటి**
పాతర్లపల్లి గ్రామం ఇల్లంతకుంట మండలంలో భూభారతి- రీ సర్వే నిర్వహించుటకు కొరకు గ్రామసభ నిర్వహించన్నైనది. ఇట్టి గ్రామ సభకు అడిషనల్ కలెక్టర్ డా . డి .శ్రీనివాస్ రెడ్డి , హుజురాబాద్ =ఐూ జల కుమారి , ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తేజస్విని, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, కిషన్ రావు , తహశీల్దార్ మనోజ్ కుమార్, ఎంపీడీవో, వెంకటరత్నం డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే హుజురాబాద్, రంజిత్ రెడ్డి గిర్ధవార్, సత్యనారాయణ సర్వేయర్ ఇట్టి సమావేశమునకు హాజరైనారు. ఈ సమావేశమును ఉద్దేశించి అడిషనల్ కలెక్టర్ రైతులందరూ సహకారంతో ఇట్టి సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ సర్వేంట్ ల్యాండ్ రికార్డ్స్ సభను ఉద్దేశించి గ్రామస్తులు వారి యొక్క ప్రతి గుంట భూమిని కూడా కొలతలు చేసి అందుకు సంబంధించిన కొలతలతో కూడిన నక్షపటమును ఇవ్వడం జరుగుతుందని, ఇట్టి అవకాశాన్ని గ్రామస్తులందరి సాయంతో రి సర్వే పూర్తిచేస్తామని చెప్పినారు.

# పట్టుదలతో చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చు

## సరస్వతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్



**జనసైన్యం సిటి**
విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చని సరస్వతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో చదివి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఆలిండియా బార్ కౌన్సిల్ ఎగ్జామ్లో అర్హత సాధించిన 2016--17 పదో తరగతి పూర్వ విద్యార్థిని గుంటి లావణ్య ఐ/శీ మల్లేశం, వెలిచాల మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లావణ్య తన పెళ్లి తర్వాత చదువును కొనసాగించి అనుకున్న లక్ష్యాన్ని సాధించిందన్నారు. అనంతరం స్కూల్ కరస్పాండెంట్, కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం లావణ్యను బొకేతో అభినందించారు.

# నగ్నంగా బయటకు పరిగెత్తిన తేజస్విని





**జనసైన్యం సిటి**
తేజస్వినిని చూసి భయంతో పరుగులు తీసిన ఒక యువకుడు..స్థానిక గుడిలోకి వెళ్లి, చేతిలో చీర, విగ్రహంతో బయటకు వచ్చిన తేజస్విని..తేజస్విని వెంట పరుగెత్తిన నలుగురైదుగురు యువకులు..చెరువు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు యువకులు, ఓ యువతి..చెరువు వద్ద కనిపించిన నలుగురు ఎవరనే దానిపై ఇంకా వీడని మిస్టరీ..అర్ధరాత్రి అరుపులు, కేకలు విన్నామని తెలిపిన పీర్జాదిగూడ స్థానికులు..తేజస్విని అనుమానాస్పద ఘటనతో భయాందోళనలో పీర్జాదిగూడ ప్రజలు..మరి కొన్ని అనుమానాలు ఈ ఘటనకు సంబంధించి తేజస్విని నివాసానికి సంబంధించిన కొన్ని షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆమె అద్దె ఫ్లాట్లో నివసిస్తున్నట్లు, దానికి రోజుకు రూ. 3,500 చొప్పున నెలకు దాదాపు రూ. లక్ష వరకు అద్దె చెల్లిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఫ్లాట్లో పై రెండు అంతస్తులను అక్రమంగా ఒక లాడ్జిలా నిర్వహిస్తున్నట్లు కూడా పోలీసులు గుర్తించారు. ఈ అంశం తేజస్విని మృతికి సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఘటనను ఆత్మహత్యగా అనుమానిస్తున్నప్పటికీ, ఆమె ప్రవర్తనకు గల అసలు కారణాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు తేజస్విని తల్లి అరుణను ప్రశ్నించడం ప్రారంభించారు. ఆమె రాసిన డెత్ డిక్లరేషన్, ఇటీవలి ఆర్థిక లావాదేవీలు, సీసీటీవీ ఫుటేజీలను కూడా పరిశీలిస్తున్నారు. ఈ కేసు మరింత విచారణకు గురవుతుండగా, తేజస్విని మృతి వెనుక ఉన్న అసలు కారణాలు త్వరలోనే వెలుగులోకి రానున్నాయి. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు, ఆర్థిక సమస్యలు, వ్యక్తిగత జీవితం వంటి అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై సమాజంలో చర్చలు జరుగుతున్నాయి, తేజస్విని మృతి వెనుక ఉన్న కారణాలు తెలుసుకోవాలని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఉదయకృష్ణారెడ్డి కేసు చెబుతున్న పెద్ద పాఠం ఇదే..!




**జనసైన్యం సిటి**
ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయకృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల కేసు బయటకు వచ్చిన రోజు నుంచే దేశవ్యాప్తంగా మీడియాలో, సోషల్ మీడియాలో ఒకే కథనం చక్కర్లు కొట్టింది. ఆయనపై వచ్చిన ఆరోపణలనే అంతిమ సత్యంగా భావిస్తూ చాలామంది తీర్పు కూడా ఇచ్చేశారు. కానిస్టేబుల్గా ఉద్యోగం చేస్తూ కష్టపడి సివిల్స్లో విజయం సాధించి ఐపీఎస్గా ఎంపికైన వ్యక్తి ఒక్కసారిగా విలన్గా మారిపోయాడు. ఆయన కెరీర్పై, వ్యక్తిత్వంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే ఇప్పుడు ఆత్మహత్యాయత్నం తర్వాత బయటకు వచ్చినట్లు చెప్పబడుతున్న సూసైడ్ నోట్ ఈ కేసులో మరో కోణాన్ని చూపిస్తోంది. ఆ నోట్లో ఉదయకృష్ణారెడ్డి చేసిన వాదనల ప్రకారం, ఇద్దరి మధ్య పరస్పర అంగీకారంతో సంబంధం ఉందని, తన వద్ద వాట్సాప్ చాట్లు, వీడియోలు వంటి ఆధారాలు ఉన్నాయని, తనపై వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదని పేర్కొన్నారు. ఇవన్నీ ప్రస్తుతం ఆయన చేసిన వాదనలు మాత్రమే; వాటి నిజానిజాలు దర్యాప్తు, కోర్టు ప్రక్రియలో తేలాల్సి ఉంది.

ఈ ఘటన మన సమాజానికి, ముఖ్యంగా మీడియా మరియు సోషల్ మీడియాకు ఒక పెద్ద ప్రశ్నను వేస్తోంది. ఏ కేసులోనైనా మొదట బయటకు వచ్చేది ఒక పక్షం కథ మాత్రమే. కానీ అదే పూర్తి నిజం అని నిర్ణయించేస్తే, తర్వాత వెలుగులోకి వచ్చే మరో కోణానికి విలువ ఉండదు. ఒక వ్యక్తిని దోషిగా తేల్చే హక్కు కోర్టుకే ఉంటుంది. కానీ సోషల్ మీడియాలో మాత్రం నిమిషాల్లోనే విచారణ పూర్తవుతోంది. ఒకసారి పేరు చెడిపోతే, తర్వాత నిజం బయటపడినా ఆ వ్యక్తి కోల్పోయిన గౌరవం, కెరీర్, మానసిక ప్రశాంతత తిరిగి రావడం చాలా కష్టం. అందుకే జర్నలిజం అంటే కేవలం మొదట వచ్చిన సమాచారాన్ని ప్రసారం చేయడం కాదు, తర్వాత వచ్చే ప్రతి కోణాన్ని కూడా సమానంగా పరిశీలించడం.

ఉదయకృష్ణారెడ్డి జీవితం మరో ముఖ్యమైన సందేశాన్ని కూడా ఇస్తోంది. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ వరకు ఎదగడం అసాధారణమైన విజయం. అలాంటి వ్యక్తి వ్యక్తిగత జీవితంలో తీసుకున్న నిర్ణయాలు, ఎలాంటి పరిస్థితుల్లోనైనా సరే, చివరకు అతని భవిష్యత్తునే సంక్షోభంలోకి నెట్టాయి. ఈ కేసులో చివరకు చట్టం ఏం చెబుతుందో, ఎవరి వాదన నిజమో విచారణ తేలుస్తుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా తెలుస్తోంది. జీవితంలో విజయం సాధించడం ఎంత కష్టమో, ఆ విజయాన్ని నిలబెట్టుకోవడం అంతకంటే కష్టం. ఒక్క తప్పు నిర్ణయం లేదా ఒక్క వివాదం ఎన్నో ఏళ్ల కష్టం మీద నిర్మించుకున్న జీవితాన్ని క్షణాల్లో మార్చేయగలదు.

ఈ ఘటనలో అసలు నేర్చుకోవాల్సిన పాఠం ఒక్కటే. ఏ విషయంలోనైనా ఒకవైపు కథ విన్న వెంటనే తీర్పు ఇవ్వకూడదు. మొదట వినిపించిన కథనే నిజం అనుకోవడం కూడా తప్పే, తర్వాత వచ్చిన కథనే పూర్తిగా నమ్మేయడం కూడా తప్పే. ప్రతి సంఘటనకు కనీసం రెండు కోణాలు ఉంటాయి. నిజం అనేది దర్యాప్తు, ఆధారాలు, న్యాయస్థానం ద్వారా బయటపడుతుంది. అందుకే మీడియా అయినా, సోషల్ మీడియా అయినా, సాధారణ ప్రజలైనా... భావోద్వేగాలతో కాదు, వాస్తవాలతో ఆలోచించే అలవాటు పెంచుకోవాలి. ఎందుకంటే మొదటి కథనం వైరల్ కావచ్చు... కానీ చివరికి నిలిచేది మాత్రం నిజమే

# జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు



**జనసైన్యం సిటి**
జాతీయ రహదారుల పై ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించేందుకు రవాణా, పోలీస్, నేషనల్ హైవే అధికారులు సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జాతీయ రహదారులపై రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

పోలీసు, రవాణా, ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులు సమన్వయంతో రహదారుల భద్రత, ప్రమాదాల నివారణకు తగిన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. "జిల్లా రహదారి భద్రతా టాస్క్ ఫోర్స్" ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన చర్యలపై సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం "రైట్ ఆఫ్ వే" మార్గం వెంబడి కొత్తగా ఎలాంటి వాణిజ్య నిర్మాణాలు అనుమతించరాదని, మునిసిపల్, ట్రేడ్ లైసెన్స్ వంటివి "రైట్ ఆఫ్ వే" వెలుపల ఏర్పాటు చేయకుండా చూడాలని, ఎలాంటి కొత్త అనుమతులూ ఇవ్వరాదని పేర్కొన్నారు. జాతీయ రహదారుల వెంట ఆక్రమణలు పరిశీలించేందుకు, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు డ్రోన్ ద్వారా నిఘా ఉంచాలని తెలిపారు. రోడ్డు భద్రత చర్యలకు అవసరమైన నిధులు కేటాయిస్తామని అన్నారు. జాతీయ రహదారుల వెంట గట్టి నిఘా, పెట్రోలింగ్, అక్రమ పార్కింగ్ వంటి అంశాలను పర్యవేక్షించాలని పోలీస్, రవాణా, నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి పెట్రోలింగ్ కోసం పోలీస్ రవాణా శాఖ సిబ్బందితో కూడిన ప్రత్యేక హైవే నిఘా బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు.

స్పీడ్ డిటెక్టర్లు, కెమెరాలు, సైన్ బోర్డులు, ఎమర్జెన్సీ కాల్ బాక్సులు వంటివి పరిశీలించాలని తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. బ్లాక్ స్పాట్ వద్ద హైమాస్ట్ లైటింగ్, స్పీడ్ ఎన్ ఫోర్స్ మెంట్ కెమెరాలు, మెట్రో రిఫ్లెక్టివ్ హెచ్చరిక సంకేతాలు వంటివి ఏర్పాటు చేయాలని అన్నారు.

భారీ వాహన డ్రైవర్లకు విశ్రాంతి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ వైద్య సహాయం కోసం సమీప ఆసుపత్రులను మ్యాపింగ్ చేయాలని తెలిపారు. ఈ సౌకర్యాలను పరిశీలించాలని, లేని చోట్ల అవసరమైన చర్యలు తీసుకుని నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని పేర్కొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో వేడుకగా బోనాల పండుగ

జనసైన్యం సిటీ

బోనాలు తెలంగాణ రాష్ట్రానికి ప్రతీకాని మరియు రాష్ట్ర పండుగగా పరిగణించడం జరిగిందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వేడుకగా ఏర్పాటు చేసినటువంటి బోనాల ఉత్సవాలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బోనాల పండుగను చాలా సంతోషంతో తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించడం జరుగుతుందని మరియు కుటుంబ సభ్యులతో మమేకమై వేడుకను నిర్వహించుకుంటారని వారు చెప్పారు. విద్యా సంస్థల్లో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా బోనాల ఉత్సవాలను చాలా గొప్పగా నిర్వహించుకోవడం

















జరిగినదని వారు చెప్పారు. ప్రతి ఒక్కరూ సంస్కృతి సాంప్రదాయాలను పాటించాలని మరియు అమ్మవారిని వివిధ రూపంలో కొలవాలని వారు చెప్పారు. బోనం అంటే భోజనం అని ఆ భోజనాన్ని మనం అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తామని అనంతరం అందరికీ పంపిణీ చేస్తామని వారు గుర్తు చేశారు. చాలా గొప్ప ఆచారమైనటువంటి బోనం సమర్పణ ద్వారా సుఖసంతోషాలతో సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొంటుందని గుర్తు చేశారు వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపచేసాయి. ప్రధానంగా విద్యార్థులు నరేందర్ రెడ్డి గారికి మూఢం అందజేసి ప్రత్యేక నృత్యం చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# నరేందర్ రెడ్డి కప్పు విజేతలకు బహుమతి ప్రధానోత్సవం

కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ నరేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహించిన నరేందర్ రెడ్డి బ్యాడ్మింటన్ కప్ విజేతలకు కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి బ్యాడ్మింటన్ విద్యార్థులకు బహుమతులు ప్రధాన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై గెలుపొందిన బ్యాడ్మింటన్ క్రీడాకారులకు బహుమతులు ప్రధాన చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారులు కందుకూరి శంకర్, నామ రమేష్, రాధాకృష్ణ, ఆదిత్య, సుబ్రహ్మణ్యం మురళి, హరీష్, బాబుతో పాటు తెలంగాణ ఉద్యమకారుడు కెంసారం తిరుపతి మాస్టర్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకులు గుంటపల్లి స్వామి. బాబు. బ్యాడ్మింటన్ క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు ఎల్లప్పుడూ అడ్డంగా ఉంటారని క్రీడలు అంటే తనకు ఇష్టమని క్రీడాకారులు ఇష్టపడే ఆడాలని ఇష్టపడి ఆడితే విజయం తప్పకుండా వరిస్తుందని అన్నారు.















